## విలేఖరులు కావలెను

పత్రికా రంగం లో సరికొత్త సంచలనం..
మా జన సముద్రం..
ప్రతి అక్షరం జనం కోసం మా నినాదం..
అనుక్షణం ప్రజా ప్రయోజనమే మరియు
సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగనున్న
మా పత్రిక లో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్
మరియు తెలంగాణ జిల్లాలు,మండలాల వారీగా
విలేఖరులు కావలెను..సామాజిక స్పృహ,వార్తల
సేకరణ పట్ల మక్కువ.. నిజాయితీ ఇవే మా
విలేఖరులకు ఉండవలసిన ముఖ్య అర్హతలు..!
సంప్రదించండి.. 9494184136



RNI NO:APTEL16151

నిరంతర వార్తా ప్రవాహం

# జనసముద్రం న్యూస్

ప్రతి అక్షరం జనం కోసం

Save Farmers

JANASAMUDRAM.COM

సంపుటి:05 | సంచిక:11 | గురువారం ఆగస్ట్ 20, 2026 | ఎడిటర్: వేణు గోపాల్ రెడ్డి | పేజీలు:08 | వెల.రూ. 2.00




## అంతరిక్ష పరిశోధనల్లో చైనా మరో కీలక ముందడుగు

- 'జూక్-3' రాకెట్‌ను విజయవంతంగా నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెట్టిన చైనా
- ప్రయోగం అనంతరం తొలి దశను భూఉపరితలంపై సురక్షితంగా ల్యాండ్ చేసింది
- దాదాపు 66.1 మీటర్ల పొడవు, 9 ఇంజిన్లతో రాకెట్
- గాన్సు ప్రావిన్స్‌లోని మిన్‌చిన్ కౌంటీలో తొలి దశ ల్యాండింగ్

2లో

## కుటుంబం గురించే ఎక్కువ చెప్పా కానీ..: ఆత్మకథపై సోనియా గాంధీ

- ఎ జర్నీ ఆఫ్ లవ్' పేరుతో సోనియా గాంధీ ఆత్మకథ
- నవంబర్ 10న పుస్తకం ప్రచురితం
- తొలిసారి తన వ్యక్తిగత జీవితంపై మనసు విప్పనున్న సోనియా
- రాజకీయాల్లోకి రావడానికి హృదయవిదారక ఘటనలు, నష్టాలే కారణం



2లో

### శాసనసభలో ఏపీపీఎస్సీ అవకతవకలపై సీఎం చంద్రబాబు ప్రకటన

# గ్రూప్-1 నియామకాల్లో భారీ అక్రమాలు

- గత ప్రభుత్వ హయాంలో నిబంధనల ఉల్లంఘన
- అనర్హులతో జవాబు పత్రాల మూల్యాంకనం
- ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో కీలక నియామక ప్రక్రియ
- స్ట్రాంగ్ రూమ్ నుంచి పత్రాల తరలింపుపై ఆందోళన
- ఓఎంఆర్ షీట్లలో మార్పులు, వైట్నర్ వినియోగం
- హైకోర్టు ఆదేశాలను సైతం లెక్కచేయని వైనం
- భవిష్యత్తులో అక్రమాలు జరగకుండా పటిష్ట వ్యవస్థ
- బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక




2లో

**అమరావతి, ఆగష్టు 19 :** గత ప్రభుత్వ హయాంలో ఏపీపీఎస్సీ గ్రూప్-1 పరీక్షల నిర్వహణ, మూల్యాంకనంలో పెద్ద ఎత్తున అక్రమాలు చోటుచేసుకున్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు శాసనసభలో తెలిపారు. రాజ్యాంగబద్ధమైన వ్యవస్థను నిర్వీర్యం చేసి యువత భవిష్యత్తుతో ఆడుకున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.

**అనర్హులతో మూల్యాంకనం**

ప్రొఫెసర్లు చేయాల్సిన పేపర్ల మూల్యాంకనాన్ని అనర్హులైన ప్రైవేటు వ్యక్తులతో చేయించారని ముఖ్యమంత్రి తెలిపారు. ఎంపిక చేసిన నిపుణుల జాబితాలో లేని వ్యక్తులకు సైతం రహస్య జవాబు పత్రాలను అప్పగించి తీవ్ర ఉల్లంఘనలకు పాల్పడ్డారని వివరించారు.

**నిబంధనల గాలికి**

కోర్టు ఆదేశాలను సైతం ఖాతరు చేయకుండా ప్రక్రియను ముందుకు తీసుకెళ్లారని చెప్పారు. జవాబు పత్రాల వివరాలను ప్రైవేటు ఈమెయిళ్లు, సామాజిక మాధ్యమ గ్రూపుల్లోకి పంపించి భద్రతా ప్రమాణాలను తుంగలో తొక్కారని సీఎం పేర్కొన్నారు.

**అనుమానాస్పద కేంద్రాలు**

ఏపీపీఎస్సీ కార్యాలయం నుంచి జవాబు పత్రాలను బయటకు తరలించి హాయ్‌ల్యాండ్‌లో ఉంచడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా మూల్యాంకనం చేపట్టి నిరుద్యోగుల ఆశలపై నీళ్లు చల్లారని మండిపడ్డారు.



## మేయర్, మున్సిపల్ చైర్మన్‌లకు ప్రత్యక్ష ఎన్నికలు

- పురపాలక శాసనముల సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం
- శాసనసభలో బిల్లును ప్రవేశపెట్టిన మంత్రి పొంగూరు నారాయణ
- ప్రత్యక్ష విధానంతో వేగవంతమైన నిర్ణయాలకు అవకాశం
- పట్టణాభివృద్ధి, పెట్టుబడుల ప్రోత్సాహానికి దోహదం

2లో




## గచ్చిబౌలి పీఎస్ పరిధిలో డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు

హైదరాబాద్: నగరంలోని గచ్చిబౌలి పీఎస్ పరిధిలో ఎస్‌వోటీ, స్థానిక పోలీసులు సంయుక్తంగా ఆపరేషన్ చేపట్టి డ్రగ్స్ రాకెట్‌ను గుట్టురట్టు చేసినట్లు శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ తెలిపారు. ముగ్గురు ప్రధాన డ్రగ్స్ సరఫరాదారులను అరెస్టు చేసి వారి వద్ద కొనుగోలు చేస్తున్న 16 మందిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు.

2లో

# త్యాగం మీది... అండ మాది

- వెలిగొండ నిర్వాసితులకు మరో రూ.200 కోట్ల పరిహారం
- నిర్వాసిత కుటుంబాలకు చెక్కు అందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు
- ఇప్పటి వరకూ రూ.518 కోట్లు పరిహారం చెల్లింపు

**అమరావతి, ఆగస్ట్ 19 :** వెలిగొండ ప్రాజెక్టు మొదటి దశ ప్రారంభోత్సవానికి గడువు దగ్గర పడుతున్న వేళ... నిర్వాసిత గ్రామాల ప్రజలకు పరిహారం అందిస్తూ ప్రభుత్వం భరోసా కల్పిస్తోంది. వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణం కోసం భూములు, ఇళ్లు కోల్పోయి త్యాగాలు చేసిన నిర్వాసిత కుటుంబాలకు అండగా నిలుస్తోంది. జూన్ 27న రూ.300కోట్లు అందించిన ప్రభుత్వం...బుధవారం ముంపు బాధితులకు మరో రూ.200 కోట్ల పరిహారాన్ని ప్రభుత్వం అందించింది.

2లో



## అవయవదాత కుటుంబాలకు రూ.లక్ష సాయం



2లో

- శాసనసభలో మానవ అవయవాల మార్పిడి సవరణ బిల్లు ఆమోదం
- బ్రెయిన్‌డెడ్ వ్యక్తుల కుటుంబాలకు ఆర్థిక సాయం పెంపు ప్రతిపాదన
- రాష్ట్రంలో 5,920 మంది అవయవాల కోసం నిరీక్షణ
- కొత్త నిబంధనలతో 'స్వాప్ దానం'కు చట్టబద్ధ అవకాశం

## రిజర్వేషన్లతో బీసీలకు న్యాయం



2లో

- స్థానిక సంస్థల్లో 34 శాతం రిజర్వేషన్లపై హర్షం
- తాడేపల్లిలో బీసీ నేతల ఆధ్వర్యంలో సంబరాలు
- చంద్రబాబు నిర్ణయం చారిత్రాత్మకమన్న మంత్రి సవిత

## రానున్న ఎన్నికల్లో పరకాల నుంచే పోటీ చేస్తా: కొండా సుస్మితా పటేల్



గీసుగొండ: రానున్న ఎన్నికల్లో పరకాల అసెంబ్లీ నియోజకవర్గం నుంచే పోటీ చేస్తానని మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్ స్పష్టం చేశారు. బుధవారం దేవాదాయ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ జన్మదిన వేడుకలను గీసుకొండలో కొండా అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న సుస్మితా పటేల్ మాట్లాడుతూ.. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ అధిష్ఠానం పార్టీ టికెట్ ఇవ్వకుంటే ఇండిపెండెంట్‌గా పరకాల నుంచే బరిలో దిగుతానని అన్నారు.

## రేవంత్‌పై అనుచిత వ్యాఖ్యలు.. కొండా సురేఖ కుమార్తెకు కాంగ్రెస్ నోటీసులు



2లో

## ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య.. 27 సార్లు పొడిచిన నిందితుడు:

నల్గొండ: సంచలనం సృష్టించిన నల్గొండ జిల్లా కొండమల్లేపల్లిలోని నాగార్జున స్కూల్ ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య కేసులో నల్గొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ కీలక విషయాలు వెల్లడించారు.



2లో




# సంపాదకీయం

## మార్పుల ముంగిట్లో బీజేపీ!

జూలైలో అపూర్వ ప్రకంపనలు సృష్టించిన విద్యార్థుల నిరసనలు, ఆ తర్వాత నినాదాల హోరులో కొట్టుకుపోయిన పార్లమెంటు వర్షాకాల సమావేశాలు, బంకీపూర్ సహా మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉప ఎన్నిక ఫలితాల తీరుతెన్నుల తర్వాత భారతీయ జనతా పార్టీ, కేంద్ర ప్రభుత్వ వ్యవహార శైలిలో ఏమైనా మార్పు వచ్చిందా? ఇదే ఇప్పుడు దేశ రాజధానిలో ఒక ప్రధాన చర్చనీయాంశంగా ఉన్నది. ప్రస్తావిత పరిణామాల ప్రభావం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లోనూ తీవ్ర స్థాయిలో ఉన్నదని చెప్పక తప్పదు. సమాజంలో వస్తున్న మార్పులపై ఉలిక్కిపడినట్లు కనపడిన ఆర్ఎస్ఎస్ ఉన్నట్లుండి దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున యువతను, విద్యార్థులను సమీకరించే కార్యక్రమంలో పడింది. సోమవారం నుంచి విశాఖపట్టణం పొలిమేరల్లోని గుడిలోవలో మూడు రోజుల పాటు జరిగే ఆర్ఎస్ఎస్ అఖిల భారత సమన్వయ బైఠక్ సమావేశంలో బీజేపీతో సహా ఆరెస్సెస్‌కు చెందిన 32 అనుబంధ సంఘాలు హాజరవుతున్నాయి. ఈ సమావేశాల్లో కూడా 'జన్ జడ్, యువతతో సంబంధాలను ఎలా మెరుగుపరుచుకోవాలి?' అన్నదే ప్రధాన అజెండా. 2027 మార్చి నాటికి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లో భారీ అంతర్గత మార్పుల క్రమం పూర్తయి కొత్త నాయకత్వంతో ప్రజల ముందుకు సరికొత్తగా వచ్చే తరుణంలో గుడిలోవ సమావేశాలు జరుగుతున్నాయి. ఇవి 'సంఘ్' పరిణామ క్రమంలో కీలక భూమిక నిర్వహించనున్నాయి. 'సంఘ్'తో పాటు భారతీయ జనతా పార్టీలో పరివర్తనానికి కూడా ఈ సమావేశాలు దోహదం చేసే అవకాశాలు లేకపోలేదు.

పన్నెండేళ్ల క్రితం భారతీయ జనతా పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చిన అనంతరం చోటుచేసుకున్న పరిణామాల ప్రభావం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌పై కూడా ఉన్నదనడంలో సందేహం లేదు. 32 అనుబంధ సంఘాల్లో బీజేపీ ఒకటి అని 'సంఘ్'లో కొందరు భావించవచ్చు కాని ఈ పన్నెండేళ్ల కాలంలో కేంద్రంలో మోదీ నాయకత్వంలో అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీయే 'సంఘ్' రూపురేఖలను మార్చిందని చెప్పడానికి ఆస్కారం లేకపోలేదు. కేంద్ర ప్రభుత్వంలోని సమస్త మంత్రిత్వ శాఖల్లోనూ 'సంఘ్' బాధ్యులు చేరడం ఒక ఎత్తు అయితే ప్రభుత్వం చేసే తప్పిదాలు, దుశ్చర్యల బాధ్యత కూడా 'సంఘ్' స్వీకరించాల్సి రావడం మరో ఎత్తు. పాకిస్థాన్ వెళ్లి మహమ్మదాలీ జిన్నాకు ఘనంగా నివాళులర్పించినందుకు నాటి బీజేపీ అగ్రనేత లాల్‌కృష్ణ ఆడ్వాణీని రాజీనామా చేయించిన ఘనత 'సంఘ్'కు దక్కింది. మరి అటువంటి నైతిక, సైద్ధాంతిక ఆధిపత్యాన్ని ప్రస్తుత పరిస్థితుల్లో చలాయించగల శక్తి 'సంఘ్'కు ఉన్నదా? ఇదీ ఇప్పుడు చర్చనీయాంశమవుతోంది. ప్రభుత్వ నియామకాల్లోనూ, పొత్తుల నిర్ణయంలోనూ, అభ్యర్థుల ఎంపికలోనూ కీలక భూమిక నిర్వహించిన 'సంఘ్' ఇవాళ ప్రభుత్వాన్ని ప్రశ్నించగలదా, నిలదీయగలదా అన్నదే కీలక ప్రశ్న. విద్యార్థులు, యువజనుల ఆందోళనను పాలకులు పట్టించుకోవాలని, విధాన నిర్ణయాల్లో తప్పిదాలు జరిగాయని మోదీ సర్కార్ అంగీకరించాలని ఆర్ఎస్ఎస్ సర్ సంఘ్ చాలక్ మోహన్ భాగవత్ పదే పదే చెబుతున్నది. మరి ప్రభుత్వం ఎంతవరకు ఆత్మ విమర్శ చేసుకుంటున్నది? ఇది విస్మరించలేని విషయం. ఇవాళ రాహుల్‌గాంధీ సహా ప్రతిపక్ష నేతలు కొందరు బీజేపీతో సహా ఆర్ఎస్ఎస్‌ను రాజకీయాల బరిలోకి లాగి వాటి సైద్ధాంతిక స్పష్టతను ప్రశ్నిస్తున్నారు. తద్వారా ఆరెస్సెస్, బీజేపీని వారు ప్రజా న్యాయస్థానంలో నిలబెడుతున్నారనేది స్పష్టం. ప్రతిపక్షాలే కాదు, ప్రజలు కూడా 'సంఘ్', బీజేపీ మధ్య పెద్ద తేడా చూడని పరిస్థితి ఏర్పడుతోంది. ఈ నేపథ్యంలో ఆర్ఎస్ఎస్ తన భావి సైద్ధాంతిక భూమికను నిర్ణయించుకోవడంతో పాటు తన అనుబంధ విభాగమైన బీజేపీని కూడా భావి అవసరాలకు తగ్గట్లు మార్చగలదా లేదా అన్నది తేలవలసి ఉన్నది.

నిజానికి ఒక దశలో, తనకు, అర్ఎస్ఎస్ తోడ్పాటు అవసరం లేదని బీజేపీ వాదించే పరిస్థితి ఏర్పడింది. 2024 లోక్‌సభ ఎన్నికల సందర్భంలో అప్పటి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్‌ప్రకాశ్ నడ్డా మాట్లాడుతూ 'మొదట్లో అంత సామర్థ్యం లేనప్పుడు ఆర్ఎస్ఎస్ అవసరం మాకు ఉండేది. ఇవాళ మా పార్టీ బాగా విస్తరించింది. తన కాళ్లమీద తాను నిలబడింది. ఇక బీజేపీ తనను తాను నిర్వహించుకోగలదు' అని స్పష్టం చేశారు. అమిత్ షా వ్యూహరచన పుణ్యమా అని ప్రపంచంలో అతి పెద్ద పార్టీగా 14 కోట్ల మంది సభ్యులతో అవతరించిన బీజేపీ ఎన్నికలను అవలీలగా గెలిచేందుకు ఒక భారీ యంత్రాంగాన్నే రూపొందించుకుంది. బీజేపీకి తిరుగులేకుండా చేసేందుకు ప్రత్యర్థి పార్టీలను నయానా భయానా వశపరుచుకోవడమో, తుత్తునియలు చేయడమో చేయగలిగింది. అందువల్లే, 2024 ఎన్నికల్లో కేవలం 240 సీట్లు మాత్రమే సాధించినప్పటికీ మోదీ, షా నాయకత్వాలకు తిరుగులేకపోయింది. ఆ తర్వాత ప్రత్యర్థులను బలహీనపరిచి ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లోనూ విజయం సాధించగలిగింది. చివరకు బెంగాల్‌ను సైతం వశపరచుకుంది. 'సంఘ్'లో కూడా అనేకమందికి మోదీ, షా నాయకత్వాన్ని అంగీకరించక తప్పని పరిస్థితి ఏర్పడింది.

## గచ్చిబౌలి పీఎస్ పరిధిలో డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు

మొదటి పేజీ తరువాయి

నిందితుల నుంచి రూ.16.40 లక్షల విలువైన 95.41 గ్రాముల ఎండీఎంఏ, 50 గ్రాముల ఓజీ కుష్ గంజాయితో పాటు 2 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

"ఆగస్టు 11న వట్టినాగులపల్లి కింగ్‌డమ్ పబ్ రోడ్డు వద్ద డ్రగ్స్ విక్రయిస్తున్న యశ్వంత్ సాయి షణ్ముఖ్ అనే పెడ్లర్‌ను అదుపులోకి తీసుకున్నాం. విచారించగా డ్రగ్స్ మూలాలు బెంగళూరు, కేరళలో ఉన్నట్లు వెల్లడైంది. వెంటనే మా ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ఈనెల 18న కేరళలోని త్రిస్సూర్‌లో మహమ్మద్ రజల్ అబ్దుల్ గఫూర్‌ను అరెస్ట్ చేశాం. విచారణలో ఓ నైజీరియన్ నుంచి డ్రగ్స్ తెచ్చినట్లు అతడు తెలిపాడు.

బెంగళూరులో నవీన అనే మహిళా పెడ్లర్‌ను పోలీసులు అరెస్ట్ చేశాం. ఆమె ఇంట్లో సోదాలు నిర్వహించి భారీగా మాదక ద్రవ్యాలు స్వాధీనం చేసుకున్నాం. నిందితురాలిని విచారించగా.. కేరళలో ఉండే తన స్నేహితుడు అనేశ్వర్ ద్వారా డ్రగ్స్ సేకరించి ఇక్కడ విక్రయిస్తున్నట్లు అంగీకరించింది. పట్టుబడిన నిందితులందరిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసులు నమోదు చేశాం. ఈ నెట్‌వర్క్‌పై దర్యాప్తు మరింత ముమ్మరంగా కొనసాగుతోంది. మాదకద్రవ్యాల సరఫరాపై ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే డయల్ 100, సైబరాబాద్ పోలీసుల వాట్సప్ నెంబర్ 8712663061కు ఫిర్యాదు చేయాలి" అని డీసీపీ సూచించారు.

## రేవంత్‌పై అనుచిత వ్యాఖ్యలు.. కొండా సురేఖ కుమార్తెకు కాంగ్రెస్ నోటీసులు

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మితా పటేల్‌కు కాంగ్రెస్ పార్టీ నోటీసులు జారీ చేసింది. దీనిపై మూడు రోజుల్లోగా వివరణ ఇవ్వాలని టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ ఆదేశించింది. కొండా సురేఖ జన్మదిన వేడుకల్లో సుస్మిత చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ అధిష్ఠానం పార్టీ టికెట్ ఇవ్వకుంటే ఇండిపెండెంట్‌గా పరకాల నుంచే బరిలో దిగుతానని ఆమె అన్నారు. ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని ఉద్దేశించి కూడా పలు విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలో వివరణ కోరుతూ టీపీసీసీ నోటీసులు జారీ చేసింది.

## అవయవదాత కుటుంబాలకు రూ.లక్ష సాయం

మొదటి పేజీ తరువాయి

**శాసనసభలో మానవ అవయవాల మార్పిడి సవరణ బిల్లు ఆమోదం**

**బ్రెయిన్‌డెడ్ వ్యక్తుల కుటుంబాలకు ఆర్థిక సాయం పెంపు ప్రతిపాదన**

**రాష్ట్రంలో 5,920 మంది అవయవాల కోసం నిరీక్షణ**

**కొత్త నిబంధనలతో 'స్వాప్ దానం'కు చట్టబద్ధ అవకాశం**

**అమరావతి, ఆగష్టు 19 :**
జీవన్మృతుల అవయవదానానికి ముందుకొచ్చే కుటుంబాలకు ఇచ్చే ఆర్థిక సాయాన్ని రూ.10 వేల నుంచి రూ.లక్షకు పెంచే ప్రతిపాదనను ముఖ్యమంత్రి పరిశీలనకు పంపినట్లు వైద్యారోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. బుధవారం శాసనసభలో మానవ అవయవాల మార్పిడి సవరణ బిల్లు-2026ను ప్రవేశపెట్టగా సభ ఆమోదించింది.

చికిత్స కేంద్రాల విస్తరణ

రాష్ట్రంలో 5,920 మంది అవయవ మార్పిడి కోసం ఎదురుచూస్తున్నారని మంత్రి తెలిపారు. మార్పిడి కేంద్రాల సంఖ్యను 3 నుంచి 9కి పెంచామని, 12 బోధనాసుపత్రుల్లోనూ ఈ సేవలను విస్తరిస్తామని చెప్పారు. అర్హులైన దాతల కుటుంబ సభ్యులకు ఒప్పంద ఉద్యోగాల కల్పనను పరిశీలిస్తున్నట్లు పేర్కొన్నారు.

స్వాప్ దానం, అక్రమాలపై కఠిన చర్యలు

కొత్త చట్టంతో దగ్గరి బంధువుల పరిధిని విస్తరించడంతో పాటు రెండు కుటుంబాల మధ్య 'స్వాప్ దానం'కు అవకాశం కల్పించామని వివరించారు. అవయవాల అక్రమ విక్రయాలు, వ్యాపారానికి పాల్పడితే 10 ఏళ్ల వరకు జైలు, రూ.కోటి వరకు జరిమానా విధిస్తామని మంత్రి తెలిపారు.

## రిజర్వేషన్లతో బీసీలకు న్యాయం

మొదటి పేజీ తరువాయి

**అమరావతి, ఆగష్టు 19 :**
స్థానిక సంస్థల్లో వెనుకబడిన వర్గాలకు 34 శాతం రిజర్వేషన్లు కల్పించినందుకు బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఆధ్వర్యంలో నాయకులు సంబరాలు జరుపుకున్నారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో కేక్ కట్ చేసి హర్షం వ్యక్తం చేశారు. టీడీపీ ఎల్లప్పుడూ బీసీల అభ్యున్నతికే ప్రాధాన్యతనిస్తుందని మంత్రి పేర్కొన్నారు.

**చారిత్రాత్మక నిర్ణయం**

గతంలో ఎన్టీఆర్ 27 శాతం రిజర్వేషన్లు ఇవ్వగా, సీఎం చంద్రబాబు దానిని 34 శాతానికి పెంచారని గుర్తుచేశారు. గత ప్రభుత్వ హయాంలో తగ్గిన రిజర్వేషన్లను తిరిగి 34 శాతానికి పెంచడం చారిత్రాత్మక నిర్ణయమని ఆమె కొనియాడారు.

**పదవుల్లో ప్రాధాన్యత**

ఈ నిర్ణయంతో స్థానిక సంస్థల్లో బీసీలకు పూర్తిస్థాయిలో పదవులు లభిస్తాయని మంత్రి తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్లు వీరంకి గురుమూర్తి, పేరేపి ఈశ్వర్, మల్లెల ఈశ్వర్, పలువురు నేతలు పాల్గొన్నారు.

## ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్య.. 27 సార్లు పొడిచిన నిందితుడు:

మొదటి పేజీ తరువాయి

జల్సాలకు అలవాటుపడిన ఇద్దరు విద్యార్థులు ప్రిన్సిపల్ ఇంటికి దొంగతానికి వెళ్లారని చెప్పారు. ఈ క్రమంలో గోడదూకి ఇంట్లో ప్రవేశించి చోరీకి పాల్పడిన విద్యార్థిని రూపారెడ్డి గుర్తించడంతో తన వెంట తీసుకెళ్లిన కత్తితో ఆమెను హత్య చేశాడన్నారు. స్కూల్ ఫీజుల వసూళ్లు జరుగుతుండటంతో ప్రిన్సిపల్ ఇంట్లో డబ్బు ఉంటుందని భావించి ఐదు రోజుల ముందు నుంచే చోరీకి ప్లాన్ చేశారన్నారు. నల్గొండలో నిర్వహించిన మీడియా సమావేశంలో హత్య కేసు వివరాలను ఎస్పీ వెల్లడించారు.

"రూపారెడ్డి హత్య కేసుపై ఐదు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి వివిధ కోణాల్లో దర్యాప్తు చేపట్టాం. దీని వెనుక పాత నేరస్థులు, సైకోలు ఉన్నారేమోనని విచారించాం. ఆ ప్రాంతంలోని సుమారు 70 సీసీ కెమెరాలను పరిశీలించాం. వాటి ఆధారంగానే పారిపోతున్న నిందితులను గుర్తించాం. రూపారెడ్డి చివరిసారిగా ఆమె పిన్నితో మాట్లాడుతూ బాబు అనే పదం వాడారు. దీంతో ఆ దిశగా దర్యాప్తు చేపట్టాం. ఎవరితో ఆమె అలా మాట్లాడారనే విషయంపై ముందుకెళ్లాం. స్కూల్‌లో పిల్లలను కూడా అలా అంటారేమోనని అక్కడ విచారించాం. ప్రిన్సిపల్ హత్య తర్వాత నాలుగురోజులు ఆ స్కూల్‌కు సెలవులు ఇచ్చారు. రీఓపెన్ తర్వాత గైర్హాజరైన 13 మంది విద్యార్థుల గురించి ఆరా తీశాం. వారిలో ఐదుగురు పదోతరగతి విద్యార్థులు ఉన్నారు. అందులో ఇద్దరు రెండు మూడు రోజుల నుంచి డబ్బు ఖర్చు చేస్తూ జల్సాలు చేస్తున్నట్లు సమాచారం వచ్చింది. వారిని అదుపులోకి తీసుకుని విచారించాం. నిందితుల్లో ఒకరి వద్ద రూ.1.54 లక్షల నగదు, ఐఫోన్ ఉన్నట్లు గుర్తించాం. నగదు ఎక్కడిదని ప్రశ్నించగా తల్లిదండ్రులు ఇచ్చినట్లు చెప్పాడు. ఆ నోట్లపై రక్తపు మరకలు ఉన్నాయి. వాటి నమూనాలను ల్యాబ్‌కు పంపిస్తే మనిషి రక్తంగా తేలింది.

**రూపారెడ్డి**

నిందితుల్లో ఒకడు అదే స్కూల్ హాస్టల్‌లో ఉండేవాడు. గతంలో అతడి బ్యాగ్‌లో కొంత డబ్బు, సెల్‌ఫోన్ దొరకడంతో ప్రిన్సిపల్ రూపారెడ్డి, టీచర్లు మందలించి డేస్కాలర్‌గా మార్చారు. ఆ సమయంలో తల్లిదండ్రుల ముందు అతడిని మందలించారు. ఈ క్రమంలో ప్రిన్సిపల్‌పై కక్ష పెంచుకున్నాడు. నిందితుడికి ఆల్కహాల్ అలవాటు, బైక్‌లపై మోజు ఉంది. నెల క్రితం గోవా టూర్‌కి వెళ్లాడు. ఎలాగైనా డబ్బు సంపాదించాలనే ఆశతో ఐదురోజుల ముందు నుంచే రూపారెడ్డి ఇంట్లో దొంగతనానికి ప్లాన్ వేసుకున్నారు. సమీపంలోని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఏ సమయంలో చోరీ వెళ్లాలనే విషయాలపై చర్చించుకున్నారు. ఈనెల 11న స్కూల్ నుంచి వచ్చిన తర్వాత నిందితులు ఇద్దరూ కలిసి ప్రిన్సిపల్ ఇంటికి వెళ్లారు. అందులో ఒకరు మాస్క్ పెట్టుకుని గోడదూకి లోపలికి వెళ్లాడు. ఈ క్రమంలో మాస్క్ ఊడిపోవడం, ప్రిన్సిపల్ గుర్తుపట్టడంతో ఆమెను హత్య చేశాడు. 27 సార్లు కత్తితో పొడిచాడు. ఆ సమయంలో ఆమె ఫోన్ కిందపడటంతో దాన్ని తీసుకెళ్లిపోయారు. నిందితుల నుంచి రూ.1.54 లక్షల నగదుతో పాటు ఐఫోన్, రూపారెడ్డి మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నాం. నిందితులు మైనర్లు అయినందున వారిని జువైనల్ జస్టిస్ బోర్డుకు పంపిస్తాం" అని ఎస్పీ వివరించారు.

## 22ఏ భూముల అంశం..

### పొంగులేటిని బర్తరఫ్ చేయాలి: హరీశ్‌రావు

మొదటి పేజీ తరువాయి

హైదరాబాద్: ప్రభుత్వం మెడలు వంచి ప్రజల ఆస్తులకు రక్షణగా ఉంటామని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు అన్నారు. 22ఏ నిషేధిత భూముల జాబితా అంశంపై తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 30, 40 ఏళ్లుగా లేని సమస్య ఇప్పుడే ఎందుకు వస్తోందని ప్రశ్నించారు.

"22ఏ జాబితా నుంచి తొలగించి రిజిస్ట్రేషన్లు చేసి మళ్లీ 22ఏ జాబితాలో పెట్టారట. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటికి రియల్ ఎస్టేట్ తెలిస్తే.. బీఆర్ఎస్‌కు పోరాటం తెలుసు. సమస్యను పరిష్కరిస్తారా.. ప్రజల కాళ్ల కింద నలిగిపోతారా?ఒక్క ఎకరా కూడా 22ఏ కింద పెట్టలేదని 10 రోజుల క్రితం పొంగులేటి చెప్పారు. ఇప్పుడు అధికారులు తప్పు చేశారంటున్నారు.

నిషేధిత జాబితా గురించి 4 నెలల క్రితమే సీఎం రేవంత్‌కు చెప్పానని మంత్రి కోమటిరెడ్డి చెప్పారు. ఆయన చెప్పినపుడే సీఎం ఎందుకు స్పందించలేదు?రేవంత్, పొంగులేటికి తెలిసే జరిగిందని స్పష్టంగా అర్థమవుతోంది. కోట్లాది ప్రజల ఆస్తులను ఇలా పెట్టే ధైర్యం అధికారులకు ఉంటుందా?చీటికి మాటికి విచారణలు చేసే రేవంత్‌రెడ్డి.. దీనిపై ఎందుకు స్పందించడం లేదు?సీఎంకు సంబంధం లేకపోతే పొంగులేటిని బర్తరఫ్ చేయాలి. 22ఏలో ఏయే భూములు పెట్టారో వాటిని తొలగిస్తే సరిపోతుంది. ప్రభుత్వం స్పందించకపోతే సీఎం ఇంటిని ముట్టడిస్తాం" అని హరీశ్‌రావు హెచ్చరించారు.

## అంతరిక్ష పరిశోధనల్లో చైనా మరో కీలక ముందడుగు

మొదటి పేజీ తరువాయి

అంతరిక్ష పరిశోధనల్లో చైనా మరో కీలక ముందడుగు వేసింది. 'జూక్-3' (ఠ్రబనబవ-3) రాకెట్‌ను విజయవంతంగా నిర్దేశిత కక్ష్యలోకి పంపి.. తొలి దశ విడిపోయిన అనంతరం తిరిగి భూఉపరితలంపై స్వాధీనం చేసుకుంది. బుధవారం డోంగ్‌ఫెంగ్ వాణిజ్య అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి ఈ ప్రయోగం చేపట్టింది.

దాదాపు 66.1 మీటర్ల పొడవైన ఈ రాకెట్ మొదటి దశ తొమ్మిది ఇంజిన్లు కలిగి ఉంది. ప్రయోగం అనంతరం తొలి దశ విడిపోయి గాన్సు ప్రావిన్స్‌లోని మిన్‌చిన్ కౌంటీలో సురక్షితంగా ల్యాండ్ అయింది. రాకెట్ తొలి దశను చైనా తిరిగి స్వాధీనం చేసుకోవడం ఇది రెండోసారి అయినప్పటికీ.. భూమిపై విజయవంతంగా ల్యాండ్ చేయడం ఇదే తొలిసారి. ఈ ఏడాది జులై 10న 'లాంగ్ మార్చ్-10బీ' రాకెట్ తొలి దశ సముద్రంలో ల్యాండ్ అయింది. తాజా ప్రయోగంలో భూ ఉపరితలంపైనే స్వాధీనం చేసుకున్నారు. అమెరికాకు చెందిన స్పేస్‌ఎక్స్(రాజూఝఎవశ), బ్లూ ఆరిజిన్ (దీశ్రీబవ రాతీఅస్త్రఱఅ) సంస్థలు 2015 నుంచే రాకెట్ తొలి దశలను తిరిగి ల్యాండ్ చేసి పునర్వినియోగిస్తున్నాయి. రాకెట్ పునర్వినియోగం వల్ల ప్రయోగాల వ్యయాన్ని గణనీయంగా తగ్గించే అవకాశం ఉంది.

## కుటుంబం గురించే ఎక్కువ చెప్పా కానీ..:

మొదటి పేజీ తరువాయి

దశాబ్దాలపాటు ప్రజా జీవితంలో ఉన్న కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీ .. తన వ్యక్తిగత జీవితం గురించి తొలిసారి మనసు విప్పనున్నారు. 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పేరిట తన ఆత్మకథను తీసుకొస్తున్నట్లు ప్రకటించారు. అది నవంబర్ 10న ప్రచురితం కానుంది. ఈ నేపథ్యంలో సోనియా మాటలను ప్రచురణకర్త ఆల్‌ఫ్రెడ్ గుర్తుచేసుకున్నారు.

సోనియా అనూహ్యంగా రాజకీయాల్లోకి ప్రవేశించారు. అప్పటివరకు ప్రజాజీవితానికి దూరంగా ఉన్న తనను.. హృదయవిదారక ఘటనలు, నష్టాలు రాజకీయాలవైపు లాగాయని సోనియా గుర్తుచేసుకున్నారు. ఈ ఆత్మకథ రాయడం, తన మనసులోతుల్లో దాచుకున్న అనుభవాలను రాబట్టడం అంత సులువుగా జరగలేదన్నారు. తన ప్రయాణంలోని ఆనందాలు, నిరాశల సమాహారమే ఈ పుస్తకం అని పేర్కొన్నారు.

మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జీవిత భాగస్వామిగా, కాంగ్రెస్ పార్టీ అగ్రనేతగానే సోనియాగాంధీ అందరికీ సుపరిచితురాలు. రాజీవ్‌తో ప్రేమ, పెళ్లి, భారత్‌కు రావడం, ఇలా తన జీవితానికి సంబంధించి ఎన్నో విశేషాలను ఈ పుస్తకం రూపంలో సోనియా (రాశీఅఱు +ుఅస్త్రఱ) వెల్లడించనున్నారు. తన అత్త, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ హత్య, ఆ తర్వాత భర్త రాజీవ్‌గాంధీ హత్య తన జీవితాన్ని ఎలా మార్చాయో పుస్తకంలో ప్రస్తావించారు.

## గ్రూప్-1 నియామకాల్లో భారీ అక్రమాలు

మొదటి పేజీ తరువాయి

**ఓఎంఆర్ స్లిప్పుల ట్యాంపరింగ్**

ఓఎంఆర్ స్లిప్పుల్లో భారీగా మార్పులు చేర్పులు జరిగాయని, వైట్నర్ వాడినట్లు ఫోరెన్సిక్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. అనేక పత్రాలపై సంతకాలు కూడా లేకపోవడం అక్రమాలకు పరాకాష్ట అని విమర్శించారు.

**సీసీ కెమెరాలు లేని గదులు**

పేపర్లు దిద్దే ప్రాంతాల్లో రోజుశ్రీవఅం తరబడి సీసీ కెమెరాలు లేకుండా మొబైల్ ఫోన్లను అనుమతించారని వివరించారు. పరీక్ష రాసిన అభ్యర్థిని సైతం ఎగ్జామినర్‌గా నియమించిన ఘోరాలు వెలుగుచూశాయని తెలిపారు.

**పటిష్ట వ్యవస్థల రూపకల్పన**

ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కమిషన్‌లో కట్టుదిట్టమైన వ్యవస్థను ఏర్పాటు చేస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. వ్యవస్థల పట్ల ప్రజల్లో విశ్వాసం పునరుద్ధరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

**కఠిన చర్యలకు నిర్ణయం**

ఈ కుంభకోణంపై పూర్తిస్థాయిలో విశ్లేషించి చట్టపరమైన తదుపరి చర్యలు తీసుకుంటామని చంద్రబాబు స్పష్టం చేశారు. యువత భవిష్యత్తును నాశనం చేసిన వారు ఎంతటి వారైనా శిక్ష తప్పదని హెచ్చరించారు.

## త్యాగం మీది... అండ మాది

మొదటి పేజీ తరువాయి

ఈ మేరకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు శాసన సభ ఆవరణలో నిర్వాసిత కుటుంబాలకు రూ.200 కోట్ల చెక్కును అందజేశారు. ఇప్పటి వరకూ వెలిగొండ నిర్వాసిత కుటుంబాలకు ప్రభుత్వం రూ.518 కోట్లను పరిహారంగా అందించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ... ప్రాజెక్టుల నిర్మాణం కోసం రైతులు, నిర్వాసితులు చేసిన త్యాగాలను ప్రభుత్వం గుర్తిస్తోందని వ్యాఖ్యానించారు. మిగతా పరిహారం సొమ్మునూ త్వరలోనే విడుదల చేస్తామని తెలిపారు. వెలిగొండ నిర్వాసితులను ఆదుకున్నది తమ ప్రభుత్వమేనని స్పష్టం చేశారు. మంచి చేసే ప్రభుత్వాలను గుర్తించాలని అన్నారు. భూములు, ఇళ్లను కోల్పోయిన తమకు ప్రభుత్వం అండగా నిలిచి పరిహారం అందించడం పట్ల నిర్వాసితులు సంతోషం వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి రుణపడి ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజా ప్రతినిధులు, నేతలు పాల్గొన్నారు.

**రూ.518 కోట్ల మేర పరిహారం అందజేత**

వెలిగొండ ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా సర్వం కోల్పోతున్న బాధితులకు అన్ని విధాలా అండగా నిలిచేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. సొంతంగా ఇళ్లు నిర్మించుకున్నందుకు గానూ ఓటీఎస్ కింద 2,557 కుటుంబాలకు ప్రభుత్వం రూ.318 కోట్ల మేర పరిహారం ఇప్పటికే చెల్లించింది. మరో 1,600 కుటుంబాలకు ఓటీఎస్ కింద రూ.200 కోట్లు పరిహారానికి సంబంధించి చెక్కును బుధవారం ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్వాసితులకు అందించారు. దీంతో నిర్వాసితులకు ఇప్పటి వరకు పరిహారం కింద 4,157 కుటుంబాలకు రూ.518 కోట్లను ప్రభుత్వం చెల్లించినట్లైంది. నిర్వాసితుల కోసం 7 పునరావాస కాలనీల్లో ప్రభుత్వం మౌలిక సదుపాయాలు కల్పిస్తోంది. వేములకోట మినహా మిగిలిన 6 కాలనీల్లో మౌలిక సదుపాయాల పనులు ఇప్పటికే పూర్తి అయ్యాయి. దీంతో ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలు ఆర్ అండ్ ఆర్ కాలనీల్లో నిర్మించిన ఇళ్లకు తరలి వెళ్తున్నాయి.

## మేయర్, మున్సిపల్ చైర్మన్‌లకు ప్రత్యక్ష ఎన్నికలు

మొదటి పేజీ తరువాయి

**అమరావతి, ఆగష్టు 19 :**
ఆంధ్రప్రదేశ్‌లో మేయర్, మున్సిపల్ చైర్మన్‌ల ఎంపికకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించేందుకు వీలు కల్పించే పురపాలక శాసనములు 4వ సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లును పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ సభలో ప్రవేశపెట్టారు. 2005 నుంచి కొనసాగుతున్న పరోక్ష ఎన్నికల విధానంలో మార్పులు చేస్తూ ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

**బలమైన ప్రజామోదం, వేగవంతమైన నిర్ణయాలు**

ప్రజలే నేరుగా ఎన్నుకోవడం వల్ల నాయకత్వానికి బలమైన ప్రజామోదం ఉంటుందని మంత్రి తెలిపారు. దీనివల్ల వేగంగా నిర్ణయాలు తీసుకోవడంతో పాటు రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పట్టణ ప్రణాళిక వంటి దీర్ఘకాలిక అభివృద్ధి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేందుకు వీలవుతుందని వివరించారు.

**సమన్వయం, అభివృద్ధికి ప్రోత్సాహం**

వివిధ ప్రభుత్వ శాఖల మధ్య మెరుగైన సమన్వయంతో పనులు వేగవంతం అవుతాయని మంత్రి పేర్కొన్నారు. పట్టణాల్లో పెట్టుబడులు, పరిశ్రమలు, పర్యాటకాన్ని ప్రోత్సహించడానికి, రాజకీయ ప్రభావం తగ్గించి సమర్థవంతంగా పాలన అందించేందుకు ఈ చట్ట సవరణ దోహదపడుతుందని తెలిపారు.

# మాడిన అన్నం.. నాణ్యత లేని పప్పుచారు

**కడ్తాల్ న్యూస్ (ఆగస్ట్ 19)జనసముద్రం**

కడ్తాల్ పీఎం శ్రీ పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనంపై తీవ్ర ఆరోపణలు

రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండల కేంద్రంలోని పీఎం శ్రీ జెడ్పీ బాలుర పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన నాణ్యతపై మరోసారి తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. పాఠశాలలో మాడిన అన్నం, నాణ్యత లేని పప్పు వడ్డించడంతో సుమారు 50-60 మంది విద్యార్థులు భోజనం చేయకుండా ఉండాల్సి వచ్చిందని తల్లిదండ్రులు, స్థానికులు ఆరోపించారు.





**నిబంధనలు ఉన్నా.. అమలు ఎక్కడ?**

విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం పౌష్టికాహారం అందించాల్సి ఉండగా, ఆహారం నాణ్యతపై ప్రశ్నలు తలెత్తడం అధికారుల పర్యవేక్షణపై సందేహాలకు దారితీస్తోంది. గతంలోనూ ఇదే పాఠశాలలో మధ్యాహ్న భోజనంపై ఫిర్యాదులు వచ్చినట్లు కథనంలో పేర్కొన్నారు.

**ఉన్నతాధికారుల ఆదేశాలకూ విలువ లేదా?**

పాఠశాలలో మధ్యాహ్న భోజన పరిస్థితిపై విద్యా కమిషన్ సభ్యులు పరిశీలన జరిపి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు స్థానికులు తెలిపారు. అయినప్పటికీ మళ్లీ అదే తరహా సమస్య తలెత్తడంపై తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**అధికారుల తనిఖీలు ఎక్కడ?**

పాఠశాలలో వంటశాల పరిశుభ్రత, వంటకు వినియోగించే సరుకుల నాణ్యత, వండిన ఆహారం నాణ్యత, విద్యార్థులకు సరిపడా భోజనం అందుతున్నదా లేదా అనే అంశాలను అధికారులు క్రమం తప్పకుండా తనిఖీ చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

**ఫిర్యాదులపై చర్యలు తీసుకున్నారా?**

ఇంతకుముందు వచ్చిన ఫిర్యాదులపై అధికారులు ఏ చర్యలు తీసుకున్నారు? పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పర్యవేక్షించే అధికారులు ఎంత తరచుగా తనిఖీలు నిర్వహిస్తున్నారు? గత తనిఖీల్లో ఏవైనా లోపాలు గుర్తించారా? గుర్తిస్తే వాటిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే ప్రశ్నలు ఇప్పుడు తల్లిదండ్రుల్లో వ్యక్తమవుతున్నాయి.

**సమగ్ర విచారణకు డిమాండ్**

విద్యార్థులకు నాణ్యత లేని భోజనం అందించిన ఘటనపై సంబంధిత ఉన్నతాధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని తల్లిదండ్రులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. బాధ్యత వహించాల్సిన వ్యక్తుల నిర్లక్ష్యం నిర్ధారణ అయితే, వర్తించే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

**విద్యార్థుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వద్దు**

మధ్యాహ్న భోజన పథకం ప్రధాన ఉద్దేశం విద్యార్థులకు పౌష్టికాహారం అందించడం. అలాంటి పథకంలో ఆహార నాణ్యతపై ఫిర్యాదులు రావడం ఆందోళనకరమని స్థానికులు పేర్కొన్నారు. ఇకనైనా అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ పెంచి, విద్యార్థులకు నాణ్యమైన మరియు సురక్షితమైన భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు

# ప్రభుత్వ నిబంధనల ప్రకారం 15 కిలోమీటర్ల వరకు ఎల్ పి జి గ్యాస్ సిలిండర్ ఉచిత డెలివరీ చేయాలి: ఆర్టిఐ ఆక్టివిస్ట్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షులు డా,,కొర్ర, కిషన్ నాయక్

**రంగారెడ్డి జిల్లా న్యూస్ (ఆగస్ట్ 19)**

కేంద్ర ప్రభుత్వం మరియు చమురు సంస్థల (ఐఓసీఎల్ , బీపీసీఎల్ , హెచ్పిసిఎల్ ) నిబంధనల ప్రకారం, గ్యాస్ ఏజెన్సీ గోడౌన్ నుండి 15 కిలోమీటర్ల వ్యాసార్థం (రత్ని) వరకు సిలిండర్ ఇంటికి డెలివరీ చేయడానికి ఎలాంటి అదనపు రుసుము చెల్లించాల్సిన అవసరం లేదు.



**ముఖ్యమైన నిబంధనలు:**

సిలిండర్ బిల్లులోనే డెలివరీ ఛార్జీలు: ప్రభుత్వం ప్రకటించే ప్రతీ ఎల్ పి జి సిలిండర్ అధికారిక బిల్లులోనే (రిటైల్ సెల్లింగ్ ప్రైస్ / గరిష్ఠ రిటైల్ ధర ) డెలివరీ ఛార్జీలు కూడా కలిసి ఉంటాయి.

అదనపు డబ్బులు చట్టవిరుద్ధం: డెలివరీ బాయ్ ఎలాంటి అదనపు రుసుము లేదా టిప్స్ బలవంతంగా వసూలు చేయడానికి వీల్లేదు.

15 కి.మీ. దాటిన ప్రాంతాలకు: గోడౌన్ నుండి 15 కిలోమీటర్ల పరిధి దాటిన ప్రాంతాలకు మాత్రమే చమురు కంపెనీలు నిర్ణయించిన అదనపు రవాణా రుసుము (డస్టెన్స్-బేస్డ్ ట్రాన్స్‌పోర్ట్ ఛార్జీలు ) వర్తిస్తుంది. సిలిండర్ అందించే సమయంలో డెలివరీ సిబ్బంది బరువును తనిఖీ చేసి (వెయిట్ చెక్ ), సీల్ సరిగ్గా ఉందో లేదో చూపి అందించాలి.

గోడౌన్ వద్ద స్వయంగా తీసుకుంటే రిబేట్: ఒకవేళ వినియోగదారుడే స్వయంగా గోడౌన్ వద్దకు వెళ్లి సిలిండర్ తీసుకుంటే, బిల్లులో చేర్చబడిన డెలివరీ ఛార్జీలను (దాదాపు రూ. 27-30) గ్యాస్ ఏజెన్సీ తిరిగి చెల్లించాలి.

అదనపు డబ్బులు అడిగితే ఫిర్యాదు చేసే మార్గాలు: టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్: 1800 233 3555 కి కాల్ చేసి మీ ఏజెన్సీ పేరుతో కంప్లైంట్ నమోదు చేయవచ్చు.



డా,, కొర్ర. కిషన్ నాయక్
RTIAS రాష్ట్ర అధ్యక్షులు
ఫోన్ నెం 9885122005

అధికారిక యాప్‌లు: ఇండేన్ (వన్ కన్స్యూమర్), హెచ్‌పీ పే , లేదా హలో బీపీసీఎల్ యాప్‌లలోకి వెళ్లి ' పిర్యాదు ' సెక్షన్‌లో నేరుగా ఫిర్యాదు చేయవచ్చు.

ప్రభుత్వం నిబంధన ప్రకారం 15 కిలోమీటర్ల వరకు ఎల్ పి జి గ్యాస్ సిలిండర్ను ఫ్రీగా డెలివరీ చేయాలని ఆర్టిఐఏఎస్ రాష్ట్ర అధ్యక్షులు డా,, కొర్ర. కిషన్ నాయక్ డిమాండ్ చేశారు.

# గనుల మూసివేత ప్రభావిత ప్రాంతాలలో పరిరక్షణ చర్యలు చేపట్టాలి,

**•కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి**

**జన సముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 19, 2026:**

బొగ్గు గనుల మూసివేతతో ప్రభావితమయ్యే ప్రాంతాల పరిరక్షణపై ప్రత్యేక చర్యలు చేపట్టాలని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి అన్నారు. బుధవారం దేశవ్యాప్తంగా గల కోల్ ఇండియా, నైవేలి లిగ్నైట్ కార్పొరేషన్, ఇతర బొగ్గు సంస్థలు, సింగరేణి ప్రభావిత జిల్లాలకు చెందిన జిల్లా కలెక్టర్లు, సంబంధిత నోడల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బొగ్గు గనుల మూసివేత ప్రభావాలకు సంబంధించి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి జి. కిషన్ రెడ్డి, మాట్లాడుతూ గనులను మూసివేసే సమయంలో పర్యావరణ పరిరక్షణపై ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, గనుల మూసివేత అనంతరం పరిసర ప్రాంతాలపై పడే ప్రభావాన్ని తగ్గించే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. గనుల మూసివేత కారణంగా ప్రభావితమయ్యే పరిసర గ్రామాల ప్రజలకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించడం, జీవనోపాధిని మెరుగుపరచడం, సామాజిక అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణపై కార్యాచరణ రూపొందించాలని తెలిపారు.





జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు మాట్లాడుతూ శ్రీరాంపూర్, మందమర్రి ఏరియాలలో చేపడుతున్న గనుల మూసివేత సంబంధిత కార్యకలాపాలు, ప్రభావిత గ్రామాలలో సామాజిక అభివృద్ధి, ప్రజల ఉపాధి కల్పనకు సంబంధించి చేపడుతున్న కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మైన్స్ ఎ.డి. జగన్మోహన్, పర్యవేక్షకులు మధుసూదన్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు రుచికరమైన, నాణ్యమైన ఆహారాన్ని అందించాలి,

**•మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య,**

**జన సముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 19, 2026:**

ప్రభుత్వ విద్యా సంస్థలలో చదువుతున్న విద్యార్థులకు సకాలంలో రుచికరమైన, పోషక విలువలు కలిగిన నాణ్యమైన ఆహారాన్ని అందించాలని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. బుధవారం జిల్లాలోని మంచిర్యాల పట్టణంలో గల కేంద్ర వంటశాలను సందర్శించి వివిధ విద్యాసంస్థలకు అల్పాహారం, జూనియర్ కళాశాలలకు మధ్యాహ్న భోజనం పంపిణీకి సంబంధించిన ఏర్పాట్లను మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అన్వేష్, అసిస్టెంట్ కమిషనర్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, మాట్లాడుతూ ప్రభుత్వ విద్యా సంస్థలలో జరుగుతున్న విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని తెలిపారు. హరే కృష్ణ మూవ్‌మెంట్ చారిటబుల్ ఫౌండేషన్, అక్షయ పాత్ర ఫౌండేషన్, మన్నా ట్రస్ట్ ప్రతినిధులతో మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ సంబంధిత విద్యాసంస్థలకు అందించే అల్పాహారం, మధ్యాహ్నం భోజనం సక్రమంగా, నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. నూతన ప్రభుత్వ ఆసుపత్రి లోని బిఈఆర్ఎ గదిని ఆర్ఎంఓ, ఈఎన్‌టి వైద్య నిపుణులు, డిఆర్‌డిఎ సదరం అధికారులతో కలిసి సందర్శించారు. బిఈఆర్ఎ గదిలో అందుబాటులో ఉన్న సౌకర్యాలు, ఎదురవుతున్న సమస్యలను అధికారులతో మాట్లాడి సమీక్షించారు. సంబంధిత గుత్తేదారుతో మాట్లాడి గుర్తించిన సమస్యలను తక్షణమే పరిష్కరించాలని, అవసరమైన పనులను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేసి సేవలు సక్రమంగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.





అనంతరం విద్యాశాఖ సమన్వయంతో ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం నిర్వహిస్తున్న సదరం ప్రత్యేక శిబిరాన్ని మంచిర్యాల ఆర్ఎంఓ, సదరం అధికారులు, కమ్యూనిటీ మొబిలైజేషన్ అధికారిలతో కలిసి సందర్శించి శిబిరంలో జరుగుతున్న ఏర్పాట్లు, పిల్లలకు అందిస్తున్న సేవలను పరిశీలించారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలకు అవసరమైన ధ్రువపత్రాలు, వైద్యపరమైన అంచనాలు, ఇతర సేవలు సులభంగా, సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. పిల్లలు, వారి తల్లిదండ్రులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా శిబిరాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ అవసరమైన సేవలు అందేలా ఏర్పాట్లు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఈనెల 27వ తేదీన జిల్లా కేంద్రం ఖమ్మంలో జరుగు ఉద్యోగ ఉపాధ్యాయుల మహా ధర్నాను జయప్రదం చేయండి

**జనసముద్రం న్యూస్ ప్రతినిధి మధిర ఆగస్టు 19,**

ఖమ్మం జిల్లా జేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యులుఅనుమోలు లు కోటేశ్వరరావు కంచర్ల శ్రీనివాసరావు

ఈరోజు ఎర్రుపాలెం మండలంలో జరుగుతున్నటువంటి టి సి కాంప్లెక్స్ ను ఉద్యోగుల ఉపాధ్యాయుల జేఏసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు అనుమోలు కోటేశ్వరరావు కంచర్ల శ్రీనివాసరావు సందర్శించి మాట్లాడుతూ 1 జులై2023 నుండి ఇవ్వాల్సినటువంటి రెండో పి ఆర్ సి రిపోర్టును తెప్పించుకొని వెంటనే అమలు పరచాలని, అలాగే పెండింగ్లో ఉన్న ఆరు డి ఏ లను వెంటనే మంజూరు చేయాలని, ఈ కుబేర్లో ఉన్న పెండింగ్ బిల్స్ ని క్లియర్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

లేనిపక్షంలో తెలంగాణ ఉద్యోగ ఉపాధ్యాయుల ఐక్యవేదిక జేఏసీ తరఫున ఈ నెల 27వ తేదీన జిల్లా కేంద్రాల్లో, సెప్టెంబర్ 10వ తేదీన రాష్ట్ర కేంద్ర హైదరాబాదులోనూ మహాధర్నా చేపడతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. జిల్లా కేంద్రంలోనూ హైదరాబాదులో జరుగు మహాధర్నాల్లో ఉద్యోగులు ఉపాధ్యాయులు వేలాదిమందిగా పాల్గొని జయప్రదం చేయవలసిందిగా,ఉద్యోగులు ఉద్యమాలను బలపరిచి హక్కుల్ని కాపాడుకోవాలని ఉద్యోగ ఉపాధ్యాయుల ను ఈ సందర్భంగా కోరారు.



ఈ సమావేశం లో టీ యస్ యూ టీ యఫ్ బాధ్యులు సుబ్బరామరాజు సత్యనారాయణ ఎస్ వెంకమ్మ పుల్లయ్య శంకర్ పిడి నాగేశ్వరరావు నాగరాజు బాబి లక్ష్మి తిరుపతమ్మ పీ ఆర్ టీ యూ బాధ్యులు రమేష్ రాఘవ భవాని నాగమణి తదితరులు పాల్గొన్నారు

# ఎంఏ తెలుగు స్పాట్ అడ్మిషన్ల గడువు పొడిగింపు

**•గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి ఆచార్య గడ్డం వెంకన్న**

**హనుమకొండ ఆగస్టు 19 (జనసముద్రం)**

వరంగల్ హంటర్ రోడ్డులోని సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం జానపద గిరిజన విజ్ఞానపీఠంలో 2026--27 విద్యా సంవత్సరానికి ఎంఏ తెలుగు రెగ్యులర్ కోర్సులో స్పాట్ అడ్మిషన్ల గడువును ఆగస్ట్ 26వ తేదీ వరకు పొడిగించినట్లు జానపద గిరిజన విజ్ఞానపీఠం పీఠాధిపతి ఆచార్య గడ్డం వెంకన్న తెలిపారు.ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అడ్మిషన్లకు సంబంధించిన పూర్తి వివరాల కోసం 99891 39136, 99894 17299 సెల్ నంబర్లను సంప్రదించాలని కోరారు.



# ఆదివాసి గిరిజన సంఘంఆధ్వర్యం లో కూనవరం

**•ఆర్టీసీ బస్టాండ్ వద్ద రిలే నిరాహార దీక్షలు**

**జనసముద్రం న్యూస్ ఆగస్టు 19 బ్యూరో చీఫ్**

కూనవరం మండలంల కేంద్రంలో ఉన్న

ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నారు.

ఆదివాసుల హక్కులు, ఉద్యోగ అవకాశాలు మరియు భూమి రక్షణ కోసం ప్రధానంగా ఈ డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతున్నారు:

1. +.వా. నెంబర్ 3ను పునరుద్ధరించాలి.
2. +.వా. నెంబర్ 3 పునరుద్ధరణకు అసెంబ్లీలో తీర్మానం చేయాలి.
3. 1/70 చట్టాన్ని పరిరక్షించి, పటిష్టంగా అమలు చేయాలి.



ఆదివాసుల హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం వెంటనే స్పందించి, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆదివాసి గిరిజన సంఘం డిమాండ్ చేస్తోందని కూనవరంమండల ఆదివాసి గిరిజన మండల కమిటీ వారు తెలిపారు.

# ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు నోటీసులు జారీ చేయాలి,





**•రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి,**

**జన సముద్రం న్యూస్ మంచిర్యాల జిల్లా ప్రతినిధి ఆగస్టు 19, 2026:**

ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా నో మ్యాపింగ్, అనమలిస్ ఓటర్లకు భారత ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చట్టసి చర్యలు తీసుకోవాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. బుధవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ముసాయిదా ఓటరు జాబితా, జిల్లాల వారీగా గుర్తించిన మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలీస్ వివరాలు, నోటీసులు జారీ, తదనంతరం విచారణ నిర్వహించే ప్రక్రియపై అన్ని జిల్లాల జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల నమోదు అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి, మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నో మ్యాపింగ్, అనమలిస్ ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించేందుకు అదనంగా 395 మంది ఎ.ఈ.ఆర్.ఓ. లను కేటాయించి, వారికి కొత్త లాగిన్లు ఏర్పాటు చేసి, ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. నో మ్యాపింగ్, అనామలీస్ ఓటర్లకు నోటీసులు జారీ చేసి, నిర్ణీత విధానంలో విచారణ నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కుమార్ దీపక్ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలో గుర్తించిన 1 లక్ష 70 వేల 967 మ్యాపింగ్ కాని, అనామలీస్ ఓటర్లకు నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు బూత్ స్థాయి అధికారులు, సూపర్‌వైజర్లు, సంబంధిత సిబ్బందికి ప్రత్యేక శిక్షణ అందిస్తామని తెలిపారు. శిక్షణ అనంతరం అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి నోటీసుల జారీ, విచారణ ప్రక్రియను నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య, మంచిర్యాల రాజస్వ మండలాధికారి శ్రీనివాసరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రకళ, జిల్లా రెవెన్యూ అధికారి మోతిరామ్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ మహమ్మద్ విలాయత్ అలీ, అన్ని మండలాల తహసిల్దార్లు, సంబంధిత ఎన్నికల

# శ్రీవారి సర్వదర్శనానికి 20 గంటల సమయం

**జనసముద్రంన్యూస్, ఆగష్టు 19;**

ఆంధ్రప్రదేశ్ : తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. టోకెన్లు లేని భక్తుల సర్వదర్శనానికి సుమారు 20 గంటల సమయం పడుతోంది. మంగళవారం ఒక్కరోజే 80,905 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 33,539 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. నిన్న శ్రీవారి హుండీ ఆదాయం రూ.6.12 కోట్లుగా నమోదైంది.



# బీసీలకు 34% రిజర్వేషన్లు కల్పించడం సామాజిక న్యాయానికి నిదర్శనం

**•ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్**

జనసముద్రం ప్రతినిధి ధనుంజయ్



ఆంధ్రప్రదేశ్ శాసనసభ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్ బిల్లుపై చర్చ సందర్భంగా గ్రామీణ స్థానిక సంస్థల్లో 34 శాతం, పట్టణ స్థానిక సంస్థల్లో 33.1 శాతం మేర బీసీ రిజర్వేషన్లు అమలు చేయాలని కూటమి ప్రభుత్వం ప్రతిపాదించినందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్ మరియు నరసాపురం శాసనసభ్యులు బొమ్మిడి నాయకర్ ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ మాట్లాడుతూ.. 2019లో అప్పటి వైసీపీ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుంచి 24 శాతానికి తగ్గించిందని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం తిరిగి బీసీ రిజర్వేషన్లను 34 శాతానికి పెంచేందుకు చర్యలు తీసుకోవడం బీసీ సామాజికవర్గానికి ఇస్తున్న గౌరవానికి నిదర్శనమని అన్నారు. బీసీలకు రాజకీయంగా, సామాజికంగా మరింత ప్రాతినిధ్యం కల్పించాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. అదేవిధంగా అగ్నికుల క్షత్రియుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన పొన్నమండ లక్ష్మణస్వామి వర్మ , శెట్టిబలిజ సామాజికవర్గానికి చెందిన దొమ్మేటి వెంకట రెడ్డి చేనేత సామాజికవర్గానికి చెందిన ప్రగడ కోటయ్య జయంతులను అధికారికంగా నిర్వహించేందుకు కూటమి ప్రభుత్వం గుర్తింపు ఇవ్వడం బీసీ సామాజికవర్గానికి అందించిన గౌరవంగా భావిస్తున్నామని తెలిపారు. బీసీ సామాజికవర్గ అభ్యున్నతికి, వారి రాజకీయ ప్రాతినిధ్యాన్ని పెంపొందించేందుకు కీలక నిర్ణయాలు తీసుకుంటున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ మంత్రి నారా లోకేష్ కి బొమ్మిడి నాయకర్ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

# కారంపూడి ఎస్సైగా బుధవారం ఉదయం బాధ్యతలు స్వీకరించిన ఎం. వాసు




జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, కారంపూడి, ఆగష్టు 19;

ఇటీవల సస్పెన్స్ గురైన కారంపూడి ఎస్ఐ వాసు తిరిగి బుధవారం మళ్లీ పై అధికారుల సూచనల మేరకు ఎస్ ఐ గా బాధ్యతలు స్వీకరించారు.

# వీరభద్ర స్వామి దేవస్థానంలో ఘనంగా 70 వ తిరునక్షత్ర మహోత్సవం ప్రారంభం

రాయచోటి జనసముద్రశీ న్యూస్

ఆగస్టు 19





శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి 70వ తీరు నక్షత్రం మహోత్సవం కార్యక్రమం రాయచోటి లోని శ్రీ వీరభద్ర స్వామి దేవస్థానంలో 70వ తిరునక్షత్ర మహోత్సవం శ్రీరామ హృదయం కలస పూజ కార్యక్రమం ఆలయ కార్యనిర్వహణాధికారి డి.వి.రమణారెడ్డి, చైర్మన్ మనోజ్ కుమార్, పాలకమండలి సభ్యుల ఆధ్వర్యంలో తిరు నక్షత్ర మహోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది. అన్నమయ్య, చిత్తూరు జిల్లాలలోని 54 మండలాల లోని కలశాలకు అర్చకులు శ్రీ యోగి స్వామి,శ్రీ శంకర స్వామిలు భక్తిశ్రద్ధలతో పూజ చేశారు. ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సోదరుడు రాయచోటి నాయకులు శ్రీ డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. 54 మండలాల్లోని కన్వీనర్లకు కలశాలను ఈ సందర్భంగా అందజేశారు. డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ చిన్న జీయర్ స్వామి వారి మంగళ శాసనాలతో ప్రతిభక్తుని హృదయాన్ని తాకించే విధంగా లోక క్షేమం కోసం కలసపూజ కార్యక్రమం స్వామీజీలు చేపట్టి నిర్వహించడం ఆనందించదగ్గ విషయం అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ మదన్ మోహన్, శ్రీ మహేష్ యాదవ్ , శ్రీ శ్రీనివాస్ యాదవ్ , శ్రీ తుమ్మల హరినాథ్ వివిధ మండలాల నుంచి వచ్చిన భక్తులు, కన్వీనర్లు, కళాకారులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**రూరల్ మండలం అంతర్గం గ్రామంలో హనుమాన్ దేవాలయం లో శ్రీ హనుమాన్ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్ రాధిక దంపతులు,కుటుంబ సభ్యులు.**





జన సముద్రం న్యూస్ జగిత్యాల జిల్లా ఆగస్టు 19

ఈ పవిత్రమైన హనుమాన్ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొనడం ఎంతో ఆనందంగా, ఆధ్యాత్మిక అనుభూతిగా ఉంది అన్నారు ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్.. ఈ కార్యక్రమాన్ని ఎంతో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, దాతలు, భక్తులందరికీ నా హృదయపూర్వక అభినందనలు.

హనుమంతుడు భక్తికి, ధైర్యానికి, సేవా భావానికి, నిస్వార్థ త్యాగానికి ప్రతీక. శ్రీరాముడి పట్ల ఆయన చూపిన అచంచలమైన భక్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శం. నేటి యువత హనుమంతుని జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకుని క్రమశిక్షణ, నిజాయితీ, సేవా భావంతో ముందుకు సాగాలి., ఆలయాలు కేవలం పూజలు చేసే స్థలాలు మాత్రమే కాదు, అని సమాజంలో ఐకమత్యాన్ని, సాంస్కృతిక విలువలను పెంపొందించే కేంద్రాలు. ప్రజలందరికీ శాంతి, సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆంజనేయ స్వామిని ప్రార్థిస్తున్నాను అన్నారు.

ఈ కార్యక్రమంలో గ్రామ,మండల నాయకులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఓల్డ్ సినిమా థియేటర్ ను తనిఖీ చేసిన అధికారులు

**•లీజు అగ్రిమెంట్ లు చూపించని నిర్వాహకులు**

**•అద్దెకు షాపులు,అనధికార విద్యుత్,నిషేధిత స్థలంలో బోరు వేసినట్లు గుర్తింపు**

**•తదుపరి చర్యలకు ఆదేశాలు జారీ ..**

జన సముద్రం న్యూస్

పల్నాడు జిల్లా ప్రతినిధి



ఆగస్టు 19

విజయపురిసౌత్: మాచర్ల మండలం విజయపురిసౌత్ లోని డౌన్ మార్కెట్ ఉన్న ఓల్డ్ సినిమా థియేటర్ లో ఇరిగేషన్ అధికారులు బుధవారం తనిఖీలు నిర్వహించారు.ఎన్ఎస్పీ పరిధిలో ఉన్న ఓల్డ్ సినిమా థియేటర్ కు గత కొన్నేళ్లుగా విద్యుత్ బిల్లులు చెల్లించక పోవడంతో తనిఖీలు నిర్వహించినట్లు సాగర్ ప్రాజెక్ట్ ఈఈ రమేష్ తెలిపారు.ఓల్డ్ సినిమా థియేటర్ వద్ద దుకాణాలు కట్టి మత్యకారులకు అద్దెలకు ఇస్తున్నట్లు,సాగర్ డ్యామ్ కు అతి సమీపంలో నిషేధిత స్థలంలో ఈ థియేటర్ వద్ద బోరు వేసి స్థానికులకు నీటిని విక్రయిస్తున్నట్లు అధికారులు గుర్తించారు.అలాగే సరైన పత్రాలు లేకపోవడంతో లీజు కు సంబంధించిన పత్రాలను జల వనరుల శాఖ కార్యాలయం లో సమర్పించాలని కోరారు.తక్షణమే విద్యుత్ ను నిలిపివేయాలని ఆదేశించారు.సరైన పత్రాలు చూపించకపోతే ఓల్డ్ థియేటర్ ను సీజ్ చేసి స్వాధీన పరచుకుంటామని నిర్వాహకులను హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో డి ఈ స్వరూపరాణి,జే ఈ లు హిమబిందు,సుధాకర్ తదితరులు ఉన్నారు

# వసంత నగర్‌లో ప్రజల గోడు.

**•స్పందించని అధికారులు.. రోజురోజుకూ పెరుగుతున్న సమస్యలు.**

జన సముద్రం న్యూస్ ఏలూరు జిల్లా ఆగస్టు19 ద్వారకాతిరుమల ప్రతినిధి.

ద్వారకాతిరుమల గ్రామంలోని వసంత నగర్ కాలనీలో ప్రజలు ప్రాథమిక సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా ఎలాంటి పరిష్కారం లేకపోవడంతో కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.స్థానికుడు చిలుకూరి చంద్రశేఖర రావు మాట్లాడుతూ.. "గత కొన్ని సంవత్సరాలుగా మేము పడుతున్న బాధలను ఎవరూ పట్టించుకోవడం లేదు. పంచాయతీ అధికారులకు, ప్రత్యేక అధికారికి విన్నవించినా ఫలితం శూన్యం" అని వాపోయారు.కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దీనివల్ల దోమలు విపరీతంగా పెరిగి చిన్నారులు విషజ్వరాల బారిన పడుతున్నారు.జనాభా కంటే కుక్కలే అధికంగా ఉన్నాయి. పిల్లలు, వృద్ధులు, ద్విచక్ర వాహనదారులపై దాడులు చేస్తున్నాయి. రోజూ భయంతోనే రాకపోకలు సాగిస్తున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు.రాత్రి వేళల్లో వీధిలైట్లు వెలగడం లేదు. కాలనీ అంతా చెత్తాచెదారంతో నిండిపోయి పాములు సంచరిస్తున్నాయి.ఓట్లు అడగడానికి మాత్రం ఇంటింటికి వస్తారు. కానీ మా సమస్యలు పరిష్కరించరు. ఇకపై మేము కూడా ఆలోచించి ఓటు వేస్తాం" అని కాలనీవాసులు హెచ్చరించారు.సంబంధిత అధికారులు వెంటనే స్పందించి డ్రైనేజీ, వీధిలైట్లు, కుక్కల నియంత్రణ, పరిశుభ్రత చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



మురుగునీరు నిలిచిపోయిన వసంత నగర్ కాలనీ రోడ్డు.



సమస్యలను వివరిస్తున్న చిలుకూరి చంద్రశేఖర రావు.

**కొయ్యలగూడెంలో పంచాయతీ పారిశుధ్య కార్మికులకుట్రాఫిక్ సేఫ్టీ జర్కిన్ లను పంపిణీ చేస్తున్న దృశ్యం**

## జన్మదినోత్సవం ఆదర్శనీయం.

జనసముద్రం న్యూస్ కొయ్యలగూడెం మండల రిపోర్టర్ ఈ.మనోహర్, ఆగస్టు 19,



ఏలూరు జిల్లా, కొయ్యలగూడెం మండల కొయ్యలగూడెం గ్రామంలో జన్మదినోత్సవాన్ని ఆదర్శనీయంగా నిర్వహించే వ్యక్తులలో డాక్టర్ కొండముది దిలీప్ కుమార్ ముఖ్యులని ప్రముఖ సినీ నటుడు సాయికిరణ్ పేర్కొన్నారు, బుధవారం సురక్ష హాస్పిటల్స్ అధినేత డాక్టర్ దిలీప్ కుమార్ సౌజన్యంతో నిర్వహించిన సేవా కార్యక్రమాలలో ఆయన ఎస్ఐ వి చంద్రశేఖర్ తో కలిసి పోలీసులు పాల్గొన్నారు, పోలీస్ స్టేషన్ గ్రౌండ్లో స్టేషన్ సిబ్బంది 30 మందికి, అదేవిధంగా మీడియా ప్రతినిధులైన 25 మందికి దిలీప్ కుమార్ సౌజన్యంతో హెల్మెట్లను పంపిణీ చేశారు. అనంతరం హాస్పిటల్ వద్ద నలభై మంది పంచాయతీ పారిశుధ్య కార్మికులకు ట్రాఫిక్ సేఫ్టీ జర్కిన్లను అందజేశారు. హాస్పిటల్ ప్రారంభించి 15 సంవత్సరాలుగా ఏజెన్సీ మెట్ట ప్రాంతంలోని గిరిజనులకు ఉచిత వైద్యం, వైద్య శిబిరాలు, నిర్వహించడంతోపాటు కరోనా మొదటి వేవ్ సమయంలో 55 రోజులపాటు అన్నార్తులకు నిర్వహించిన అన్న సమారాధనకు చేయూత అందించారన్నారు. ఒక మిత్రుడిగా దిలీప్ కుమార్ ను చూసి గర్వపడుతున్నాను అని సాయికిరణ్ తెలిపారు. గతంలో ఆయన జన్మదినోత్సవాల సందర్భంగా పోలీస్ స్టేషన్ అభివృద్ధికి, స్టేషన్ పరిధిలో ఏర్పాటు చేసుకున్న రవాణా, ట్రాఫిక్ సౌకర్యాలకు దిలీప్ కుమార్ ఆర్థిక సహాయం అందించి సహకరించారని ఎస్ఐ అభినందించారు. అనంతరం దేవరపల్లి మండలం గొల్లగూడెం వృద్ధాశ్రమం, అనాధ ఆశ్రమాలలోని వారికి పౌష్టికాహారం, పండ్ల రసాలు అందజేశారు. ప్రతి బుధవారం గర్భిణీ స్త్రీలకు తమ హాస్పిటల్లో ఉచిత ఆరోగ్య వైద్య పరీక్షలు నిర్వహిస్తామని శ్యామల దిలీప్ కుమార్ దంపతులు పేర్కొన్నారు.

# తాగునీటి సరఫరా లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: సాగర్ ప్రాజెక్టు ఈఈ రమేష్

జన సముద్రం న్యూస్ పల్నాడు జిల్లా ప్రతినిధి ఆగస్టు 19



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ లో అంతర్భాగమైన విజయపురిసౌత్ కాలనీ కి అందించే నీటి సరఫరా లో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సాగర్ ప్రాజెక్టు ఈఈ రమేష్ తెలిపారు.బుధవారం స్థానిక ఫిల్టర్ హౌస్ పరిధిలోని పంపుహౌస్ ను ఆయన పరిశీలించారు.గత మంగళవారం పంపు హౌస్ లోని తాగునీటి మోటార్ మరమ్మతులకు గురవడంతో మరొక మోటార్ ను యుద్ధప్రాతిపదికన సిద్ధం చేసి నీటి సరఫరా ను పునరుద్ధరించారు.సిబ్బంది విధుల్లో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. విజయపురిసౌత్ కాలనీ లో తాగునీరు,విద్యుత్ సమస్య లేకుండా చూడాలని ఉద్యోగులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో డి ఈ స్వరూపరాణి,జే ఈ లు హిమబిందు,సుధాకర్,వర్క్ ఇన్స్పెక్టర్ అబ్దుల్లా,గొల్లా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# నేడు జరుగనున్న చెన్నారెడ్డి పెద్దకర్మ

జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల నియోజకవర్గం, ఆగష్టు 19;



ఇటీవల దుండగుల దాడిలో హత్య గావించబడిన పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం రెంటచింతల మండలంలోని రెంటాల గ్రామానికి చెందిన నవులూరి చెన్నారెడ్డి పెద్దకర్మ నేడు అనగా 20.8.2026 గురువారం రెంటాల లోని తన స్వగృహంలో జరుగుతుందని చెన్నారెడ్డి అన్నయ్య (పెద్ద నాన్న కొడుకు) నవులూరి శివారెడ్డి తెలిపారు. కావున ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు తప్పక పాల్గొనాలని కోరారు.

# తెలంగాణా మద్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు వైసీపి నేతలు అరెస్ట్



**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల నియోజకవర్గం, ఆగస్టు 19:**
మాచర్ల నియోజకవర్గం, మాచర్ల మండలంలోని నాగార్జున సాగర్ అంతర్ రాష్ట్ర పోలీస్ చెక్ పోస్ట్ వద్ద పోలీసుల తనిఖీలు చేస్తుండగా, తెలంగాణా మద్యాన్ని ఏపి లోకి అక్రమంగా తరలిస్తున్న వైసిపి నేతలు ఎస్ ఐ.గిరిబాబు అదుపులో తీసుకున్నారు. వైసీపీ నేతల కారులో 11 లీటర్ల తెలంగాణా మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిలో రెంటచింతలకు చెందిన వైసీపీ నేతలు పూజల వెంకట్రామయ్య, వెంకటేశ్వర్లు గా గుర్తించారు. వైసీపీ నేతలతో పాటు అక్రమ మద్యాన్ని నాగార్జునసాగర్ పోలీస్ స్టేషన్ కు పోలీసులు తరలించారు.

# హైస్కూల్ మరియు కాలేజీ విద్యార్థినీ, విద్యార్థులకు జాగృతి కాంపిటీషన్స్



మెట్టు గోవిందరెడ్డి,
శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల, ఆగస్టు 19:**
రామకృష్ణ మిషన్ రాజమండ్రి వారి యొక్క ఆధ్వర్యంలో మరియు శ్రీ రామకృష్ణ సేవా సమితి మాచర్ల వారి సౌజన్యంతో ఎప్పటిలాగానే ఈ సంవత్సరం కూడా స్వామి వివేకానంద స్ఫూర్తితో హై స్కూల్ మరియు కాలేజ్ విద్యార్థినీ, విద్యార్థులకు జాగృతి కాంపిటీషన్స్ నిర్వహిస్తున్నట్లు శ్రీ రామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవింద రెడ్డి తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులకు విద్యార్థి దశ నుండే నైతిక ,ఆధ్యాత్మిక విలువలు పెంపొందించేందుకు వివేకానంద ఫర్ యూత్ అనే ఇంగ్లీషు పుస్తకం ఆధారంగా ఈ పోటీలు నిర్వహిస్తున్నట్లు గోవిందరెడ్డి తెలిపారు. 2026 ఆగస్టు 30వ తేదీలోపు తమ స్కూల్, కాలేజీల ప్రిన్సిపాల్ కు పరీక్ష ఫీజు 15 రూపాయలు చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. పరీక్షల్లో పాల్గొన్న ప్రతి పదిమంది విద్యార్థులకు ఒక బహుమతి తప్పనిసరిగా ఉంటుందని మెట్టు గోవింద రెడ్డి తెలిపారు. మరిన్ని వివరములకు శ్రీరామకృష్ణ సేవా సమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి సెల్ నెంబర్.. 944000 6813 మరియు 9346162835 లను సంప్రదించగలరు. ముందుగా పేర్లు నమోదు చేసుకున్న వారికి మాత్రమే అవకాశం కలదు.

# నాలెడ్జ్ పార్ట్నర్ గా డా.జి. వెంకట్రామిరెడ్డి నియామకం

**జనసముద్రంన్యూస్,పల్నాడు జిల్లా,మాచర్ల, ఆగస్టు 19:**
మాచర్ల నియోజకవర్గ నాలెడ్జ్ పార్ట్నర్ గా డా.జి. వెంకట్రామిరెడ్డిని నియమిస్తూ పల్నాడు జిల్లా కలెక్టర్ డా. కృతికా శుక్లా ఉత్తర్వులు జారీ చేశారు. ఈయన నియోజకవర్గ విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్ ను పర్యవేక్షిస్తూ నియోజకవర్గ అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పన చేసే వాటిలో సలహాలు, సూచనలు ఇస్తారు. అమరావతిలోని ప్రణాళిక శాఖకు అనుసంధానంగా ఉంటూ ఎప్పటికప్పుడు అభివృద్ధి కొరకు ప్రణాళికలు తయారు చేస్తారు. స్థానిక శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి తో అనుసంధానంగా ఉంటూ అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనలో చేదోడు వాదోడుగా పనిచేస్తారు.



# అందరి సహకారంతో ఒంటిమిట్ట మండల అభివృద్ధికి

## కృషి-ఎంపీపీ అక్కి లక్ష్మీదేవి వైస్ ఎంపీపీ నల్లగొండు లక్ష్మీదేవి .





**ఒంటిమిట్ట, జనసముద్రం న్యూస్, ఆగస్టు 19:**
అధికారులు ప్రజాప్రతినిధుల అందరి సహకారంతో ఒంటిమిట్ట మండల అభివృద్ధికి కృషి చేశామని ఒంటిమిట్ట మండలాధ్యక్షురాలు అక్కి లక్ష్మీదేవి ఉప మండల అధ్యక్షురాలు నల్లగొండు లక్ష్మీదేవి అన్నారు. ఒంటిమిట్ట మండల చివరి సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ అక్కి లక్ష్మీదేవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కి లక్ష్మీదేవి మాట్లాడుతూ ఐదు సంవత్సరాలు పదవీకాలంలో అందరి సహకారంతో ఒంటిమిట్ట మండల అభివృద్ధికి కృషి చేశామన్నారు. తనకు సహాయ సహకారాలు అందించిన అధికారులకు ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు ఒంటిమిట్ట చెరువు ఆయకట్టు సంఘ చైర్మన్ పాటూరు గంగిరెడ్డి మాట్లాడుతూ ఒంటిమిట్ట బస్టాండ్ లో మరుగుదొడ్లు లేక ఆడ యాత్రికులు భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఒంటిమిట్ట కోదండ రామాలయం అధికారికంగా ఆలయంగా ప్రకటించిన తర్వాత ఎక్కువమంది భక్తులు యాత్రికులు ఒంటిమిట్టకు వస్తున్నారన్నారు. బస్టాండు లో మరుగు దొడ్డి లేక యాత్రికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండులో మరుగుదొడ్డి నిర్మించాలని కోరారు. ఒంటిమిట్ట చెరువు ఆయకట్టు సంఘవైస్ చైర్మన్ కట్టా యానాదయ్య మాట్లాడుతూ ఒంటిమిట్ట రైతు భరోసా కేంద్రంలో ఎరువులు అందుబాటులో ఉంచకపోవడంతో మాధవరం వెళ్లి ఎరువులు తెచ్చుకోవడానికి రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు ఇప్పటికైనా ఒంటిమిట్ట రైతు భరోసా కేంద్రంలో ఎరువులు అందుబాటులో ఉంచాలని కోరారు. శాఖల వారీగా రివ్యూ నిర్వహించారు. ఎంపీడీవో సుజాతమ్మ మాట్లాడుతూ సమావేశానికి డుమ్మాగొట్టిన అధికారులకు షోకాజ్ నోటీసులు ఇస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎంపీడీవో సుజాతమ్మ డిప్యూటీ తా హ సిల్దార్ అంజన గౌరీ ఎంపిటిసి సుంకేసుల భాష తదితరులు పాల్గొన్నారు.

# బీసీ లకు 34% రిజర్వేషన్ కల్పించిన..

## ప్రముఖుల చిత్రపటాలకు పాలాభిషేకం చేసిన బీసీ నాయకులు

**జనసముద్రంన్యూస్, పల్నాడు జిల్లా, మాచర్ల, ఆగస్టు 19:**
ఏపీ రాష్ట్రం లోని బీసీలకు 34% శాతం రిజర్వేషన్ కల్పించి, నేడు గవర్నర్ కోటాలో వడ్డెర బిడ్డ దళవాయి రమాదేవి కి, ఎమ్మెల్సీ అవకాశం కల్పించిన ఏపీ ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు కి, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ కి, యువనేత, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కి, బీసి సంక్షేమ శాఖ మంత్రి, బీసీ సంక్షేమ సారధి ఎస్. సవితమ్మ కి, పార్లమెంట్ సభ్యులు లావు కృష్ణ దేవరాయులు కి, మాచర్ల శాసన సభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి కి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తూ బీసీల సంక్షేమం కొరకు ఇంతగా అహర్నిశలు శ్రమిస్తున్న బీసీ మంత్రులను సన్మానించి, కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపి, పాలాభిషేకం చేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర వడ్డెర సంక్షేమ కార్పోరేషన్ డైరెక్టర్
మరియు మాచర్ల టిడిపి అధ్యక్షులు కొమెర దుర్గారావు, జనసేన నాయకులు లాల్ కృష్ణ, శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి దేవాలయం ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ కొమెర అనంత్రములు, టిడిపి



నాయకులు బృంగా రమణయ్య పలువురు బీసీ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

# అనంతగిరిలో పశువులను నిర్లక్ష్యంగా వదిలేస్తే చర్యలు

## రైతుల పంటలకు నష్టం, వాహనదారులకు ఇబ్బందులు పంచాయతీ హెచ్చరిక

**అనంతగిరి, జనసముద్రం న్యూస్, ఆగస్టు 19:**
గ్రామ పంచాయతీ పరిధిలో పశువులను నిర్లక్ష్యంగా బయటకు వదిలేస్తూ ఇతర రైతుల పంట పొలాల్లోకి వెళ్లేలా చేస్తున్న యజమానులకు గ్రామ పంచాయతీ అధికారులు హెచ్చరిక జారీ చేశారు. పశువుల కారణంగా పంటలకు నష్టం వాటిల్లడంతో కొంతమంది రైతులు పంచాయతీకి ఫిర్యాదు చేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

పశువులను కాపలా లేకుండా వదిలేయడం వల్ల అవి ఇతర రైతుల పొలాల్లోకి వెళ్లి పంటలను నాశనం చేస్తున్నాయని, అలాగే రాత్రి సమయాల్లో మండల కేంద్రంలోని ప్రధాన రహదారులపై అడ్డంగా పడుకోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పంచాయతీ అధికారులు పేర్కొన్నారు. కొన్ని సందర్భాల్లో పశువులు వాహనాలకు అడ్డుగా రావడం వల్ల



ప్రమాదాలు జరిగే పరిస్థితులు కూడా ఏర్పడుతున్నాయని తెలిపారు.

అంతేకాకుండా సరైన ఆహారం, పోషణ, సంరక్షణ లేకపోవడంతో కొన్ని పశువులు అనారోగ్యానికి గురై మండల కేంద్రంలోనే మృతి చెందిన సందర్భాలు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. పశువులను నిర్లక్ష్యంగా వదిలేయడం వల్ల రైతులు, ప్రజలు, వాహనదారులతో పాటు మూగజీవులకు కూడా నష్టం జరుగుతోందని తెలిపారు.ఇకపై పశువులను నిర్లక్ష్యంగా వదిలే యజమానులకు మూడు సార్లు నోటీసులు జారీ చేసి హెచ్చరిస్తామని, అయినప్పటికీ పరిస్థితిలో మార్పు లేకపోతే సంబంధిత పశువులను గ్రామ పంచాయతీ స్వాధీనం చేసుకునే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పశువుల యజమానులు బాధ్యతగా వ్యవహరించి వాటికి సరైన కాపలా, ఆహారం, సంరక్షణ కల్పించాలని పంచాయతీ అధికారులు కోరారు.

ఈ మేరకు అనంతగిరి గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి పేరుతో 19-08-2026న అధికారిక నోటీసు జారీ చేశారు. గ్రామ ప్రజలు పంచాయతీ సూచనలను పాటించి రైతుల పంటలకు, ప్రజల భద్రతకు, పశువుల సంక్షేమానికి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

పంచాయతీ సెక్రెటరీ: చిట్టంనాయక్ దేవ

# మేయర్, మున్సిపల్ చైర్మన్‌లకు ఇకపై ప్రత్యక్ష ఎన్నికలు

- **ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనములు 4వ సవరణ బిల్లుకు అసెంబ్లీ ఆమోదం**
- **బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టిన మంత్రి నారాయణ**

**నెల్లూరు, ఆగస్టు 19, జన సముద్రం జిల్లా ప్రతినిధి.**
ఆంధ్రప్రదేశ్‌లో మేయర్, మున్సిపల్ చైర్మన్‌ల ఎంపికకు ఇకపై ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించేందుకు వీలు కల్పించే ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనములు 4వ సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లును రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ శాసనసభలో ప్రవేశపెట్టారు.ప్రస్తుతం మేయర్, మున్సిపల్ చైర్మన్‌లను పరోక్ష విధానంలో ఎన్నుకుంటున్న నేపథ్యంలో, ఎన్నికల విధానంలో మార్పు తీసుకువస్తూ ప్రభుత్వం ఈ చట్ట సవరణను ప్రతిపాదించింది.

**1986 వరకు పరోక్ష ఎన్నికలు**

బిల్లు ప్రవేశపెట్టిన సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ, 1986 వరకు మేయర్, మున్సిపల్ చైర్మన్‌ల ఎంపికకు పరోక్ష ఎన్నికలు జరిగేవని తెలిపారు. అనంతరం 1986 నుంచి 2005 వరకు ప్రత్యక్ష ఎన్నికలు జరిగాయని, 2005 నుంచి ఇప్పటివరకు మళ్లీ పరోక్ష ఎన్నికల విధానం కొనసాగుతోందని వివరించారు. ప్రస్తుతం తీసుకొచ్చిన చట్ట సవరణతో ఇకపై మేయర్, మున్సిపల్ చైర్మన్‌ల ఎన్నికలు ప్రత్యక్ష విధానంలో నిర్వహించేందుకు అవకాశం కలుగుతుందని మంత్రి తెలిపారు.

**ప్రత్యక్ష ఎన్నికలతో అనేక ప్రయోజనాలు**

ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ప్రజలే నేరుగా మేయర్ లేదా మున్సిపల్ చైర్మన్‌ను ఎన్నుకోవడం వల్ల అనేక ప్రయోజనాలు ఉంటాయని మంత్రి నారాయణ



పేర్కొన్నారు.

ప్రత్యక్ష ఎన్నికల్లో ప్రజల నుంచి ఎన్నికైన మేయర్, చైర్మన్‌కు బలమైన ప్రజామోదం ఉంటుందని తెలిపారు. అలాగే కౌన్సిలర్లు, కార్పొరేటర్ల ద్వారా కాకుండా ప్రజలే నేరుగా ఎన్నుకోవడం వల్ల మేయర్ లేదా చైర్మన్‌పై కౌన్సిలర్లు, కార్పొరేటర్ల ప్రభావం ఉండదని వివరించారు.

**వేగవంతమైన నిర్ణయాలకు అవకాశం**

ప్రత్యక్ష ఎన్నికల విధానంతో మేయర్, చైర్మన్‌లు వేగవంతమైన నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంటుందని మంత్రి తెలిపారు. నగరాలు, పట్టణాల అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టులను త్వరితగతిన అమలు చేసేందుకు ఇది దోహదపడుతుందని చెప్పారు. అదేవిధంగా రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, ప్రజా రవాణా, వ్యర్థాల నిర్వహణ, పట్టణ ప్రణాళిక వంటి అంశాల్లో సుదీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలను రూపొందించి అమలు చేసే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

**వివిధ శాఖలతో మెరుగైన సమన్వయం**

అభివృద్ధి పనుల అమలులో వివిధ ప్రభుత్వ శాఖలు, సంస్థలతో మెరుగైన సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేసేందుకు ప్రత్యక్ష ఎన్నికైన మేయర్, చైర్మన్‌కు అవకాశం ఉంటుందని మంత్రి నారాయణ తెలిపారు.

**పెట్టుబడులు, పరిశ్రమలు, టూరిజం ప్రోత్సాహం**

నగరాలు, పట్టణాల్లో పెట్టుబడులు, పరిశ్రమలు, పర్యాటక రంగాన్ని చురుకుగా ప్రోత్సహించేందుకు మేయర్ లేదా మున్సిపల్ చైర్మన్‌కు మరింత అవకాశం ఉంటుందని మంత్రి పేర్కొన్నారు.

**రాజకీయ ప్రభావం తగ్గుతుంది**

ప్రత్యక్ష ఎన్నికల విధానం ద్వారా మేయర్ లేదా చైర్మన్‌పై రాజకీయ ప్రభావం తగ్గే అవకాశం ఉంటుందని మంత్రి నారాయణ తెలిపారు. ప్రజల నుంచి నేరుగా ఎన్నికైన నాయకత్వం ద్వారా పట్టణాభివృద్ధిపై మరింత సమర్థవంతంగా దృష్టి సారించవచ్చని చెప్పారు.

అదేవిధంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల పరిధిలోని అన్ని వర్గాల ప్రజల అవసరాలను పరిగణనలోకి తీసుకుని అభివృద్ధి పనులు చేపట్టేందుకు ప్రత్యక్ష ఎన్నికలు మరింత ఉపయోగకరంగా ఉంటాయని మంత్రి వివరించారు.

ప్రత్యక్ష ఎన్నికల ద్వారా ప్రజామోదంతో కూడిన నాయకత్వం, వేగవంతమైన నిర్ణయాలు, దీర్ఘకాలిక అభివృద్ధి ప్రణాళికలు, శాఖల మధ్య మెరుగైన సమన్వయం, పెట్టుబడులుపరిశ్రమలుపర్యాటక రంగాల ప్రోత్సాహం వంటి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఈ చట్ట సవరణను తీసుకొచ్చినట్లు మంత్రి నారాయణ తెలిపారు.ఆంధ్రప్రదేశ్ పురపాలక శాసనములు 4వ సవరణ బిల్లుకు శాసనసభ ఆమోదం లభించడంతో ఇకపై మేయర్, మున్సిపల్ చైర్మన్‌ల ఎంపికకు ప్రత్యక్ష ఎన్నికల విధానం అమల్లోకి రానుంది.

# రైతుల ఆదాయం పెంచే సాంకేతికతను క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలి.

- **అగ్రి ఎక్స్‌పోలో ప్రదర్శించిన పరిజ్ఞానం ప్రతి రైతుకు చేరాలి: జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల**
- **అగ్రి ఎక్స్‌పోకు విశేష స్పందన**
- **ఎల్‌నినో, వాతావరణ పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు శాస్త్రవేత్తల అవగాహన**
- **వ్యవసాయ యంత్ర పరికరాల పట్ల రైతుల ఆసక్తి**





**నెల్లూరు, ఆగస్టు 19: జనసముద్రం జిల్లా ప్రతినిధి.**
వ్యవసాయాన్ని మరింత లాభదాయకంగా మార్చడంతో పాటు రైతుల ఆదాయాన్ని పెంచే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం, శాస్త్రీయ సాగు విధానాలను క్షేత్రస్థాయిలో ప్రతి రైతుకు చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల సూచించారు. అగ్రి ఎక్స్‌పోలో ప్రదర్శించిన సాంకేతికత కేవలం ప్రదర్శనకే పరిమితం కాకుండా రైతుల పొలాల్లో ఆచరణలోకి వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన స్పష్టం చేశారు.

నెల్లూరులోని ఏ.సి. సుబ్బారెడ్డి స్టేడియంలో బుధవారం నిర్వహించిన అగ్రి ఎక్స్‌పో & కిసాన్ మేళా2026 కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని వివిధ స్టాల్స్‌ను సందర్శించారు. వ్యవసాయ యంత్రాలు, డ్రోన్లు, ఆధునిక సాంకేతిక పరికరాలు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, వ్యవసాయ అనుబంధ ఉత్పత్తులను పరిశీలించి, వాటి వినియోగం, రైతులకు కలిగే ప్రయోజనాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు.

రైతుల అవసరాలు, క్షేత్రస్థాయిలో వారు ఎదుర్కొంటున్న సమస్యలు, ఆధునిక వ్యవసాయ పద్ధతులపై రైతుల అవగాహన తదితర అంశాలపై కలెక్టర్ రైతులు, చాంపియన్ ఫార్మర్స్, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలతో ముఖాముఖిగా చర్చించారు. రైతులకు ఉపయోగపడే సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావడమే ఇటువంటి ఎక్స్‌పోల ప్రధాన ఉద్దేశమని తెలిపారు.

సాంకేతికత,యాంత్రీకరణ, శాస్త్రీయ సాగుఅగ్రి ఎక్స్‌పోలో జిల్లాలోని వివిధ మండలాల నుంచి సుమారు 1,000 మంది రైతులు పాల్గొన్నారు. రైతులకు ఆధునిక వ్యవసాయ సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయ యాంత్రీకరణ, పంటల సాగు, పంటల ఆరోగ్యం, నీటి యాజమాన్యం, వ్యవసాయ అనుబంధ రంగాలు, ప్రభుత్వ పథకాలపై ఒకే వేదికగా అవగాహన కల్పించారు.

వివిధ వ్యవసాయ యంత్రాలు, డ్రోన్లు, ఆధునిక సాగు పరికరాలు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, ఇతర సాంకేతిక ఉత్పత్తులను రైతులకు ప్రత్యక్షంగా ప్రదర్శించారు. వ్యవసాయ యంత్ర పరికరాల పనితీరు, వాటి వినియోగం, ప్రయోజనాలను తెలుసుకునేందుకు రైతులు ఆసక్తి చూపారు. తయారీదారులు, శాస్త్రవేత్తలు, అధికారులు రైతులతో ముఖాముఖిగా మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు.

**ఎల్‌నినో, వాతావరణ పరిస్థితులపై శాస్త్రవేత్తల సూచనలు**

నీటి లభ్యత, ప్రస్తుత వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని జొన్న, సజ్జ, మొక్కజొన్న, రాగి వంటి ప్రత్యామ్నాయ పంటల సాగును రైతులు పరిశీలించాలని శాస్త్రవేత్తలు సూచించారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో కంది, మినుము, పెసర, శనగ వంటి పప్పుధాన్యాలను సాగు చేసుకోవాలని సూచించారు.

ఎల్‌నినో, వాతావరణ పరిస్థితుల ప్రభావంతో బోరు బావుల కింద సాగు చేసే వరి పంటలు ఎక్కువగా ప్రభావితమయ్యే అవకాశం ఉందని శాస్త్రవేత్తలు తెలిపారు. కీలక దశల్లో పంటలకు అవసరమైన నీటిని అందించడంతో పాటు నీటి యాజమాన్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు.

పంట అవశేషాలను కాల్చివేయకుండా పొలంలోనే సక్రమంగా వినియోగించడం ద్వారా నేలలో సేంద్రియ పదార్థం, పోషకాలు పెరుగుతాయని తెలిపారు. మట్టి పరీక్షల ఆధారంగా ఎరువులను వినియోగించాలని సూచించారు.

నెల్లూరు ప్రాంతానికి అనుకూలమైన ఎన్‌ఎల్‌ఆర్ 36896 వరి రకానికి రైతుల్లో మంచి ఆదరణ ఉందని, ఎన్‌ఎల్‌ఆర్ 3238 రకంలో అధిక జింక్ శాతంతో పాటు తక్కువ గ్లైసెమిక్ ఇండెక్స్ ఉన్నందున రైతులు ఈ రకాన్ని కూడా సాగు చేసి ప్రయోజనం పొందవచ్చని శాస్త్రవేత్తలు వివరించారు.

రైతులకు ప్రభుత్వ పథకాలపై అవగాహన పంటల బీమా, ప్రధానమంత్రి కిసాన్, అన్నదాత సుఖీభవ, వ్యవసాయ యాంత్రీకరణ, డ్రోన్ల వినియోగం, పంట సాగుదారుల హక్కు కార్డులు, రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాల పంపిణీ తదితర అంశాలపై వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు.సూక్ష్మ సేద్యంలో బిందు, తుంపర సేద్య పరికరాలకు అందుబాటులో ఉన్న రాయితీ, ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు లభించే సహాయం, ఉద్యాన పంటల అనంతర నిర్వహణకు సంబంధించిన రాయితీ పథకాలు, ఆయిల్‌పామ్ సాగు అవకాశాలను అధికారులు వివరించారు.మహిళా రైతులు స్వయం సహాయక సంఘాల్లో చేరడం ద్వారా బ్యాంకింగ్ సేవలు, రుణ సదుపాయాలు పొందడంతో పాటు తినడానికి సిద్ధంగా ఉండే, వంటకు సిద్ధంగా ఉండే ఉత్పత్తుల తయారీ, కోళ్లు, పశువుల పెంపకం వంటి ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.యువత వ్యవసాయాన్ని ఉపాధి అవకాశంగా చూడాలి: జెడ్పీ చైర్‌పర్సన్ జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ అరుణమ్మ మాట్లాడుతూ, అగ్రి ఎక్స్‌పో రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. ముఖ్యంగా యువత వ్యవసాయాన్ని ఉపాధి అవకాశంగా స్వీకరించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని తెలిపారు. ఆధునిక సాంకేతికతలు, వ్యవసాయ పరికరాలను ఒకే వేదికపై తెలుసుకునే అవకాశం రైతులకు లభించిందన్నారు. ఎక్స్‌పోలో తెలుసుకున్న విషయాలను రైతులు తమ గ్రామాలకు తీసుకెళ్లి ఆచరణలో పెట్టాలని సూచించారు.

రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలి: మేయర్ మున్సిపల్ చైర్‌పర్సన్ దేవరకొండ సుజాత మాట్లాడుతూ, అగ్రి ఎక్స్‌పో ద్వారా రైతులకు అందించిన విజ్ఞానం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయ రంగంలో వస్తున్న ఆధునిక మార్పులను రైతులు అందిపుచ్చుకోవాలని సూచించారు. ఒకే వేదికపై వివిధ వ్యవసాయ పరికరాలు, సాంకేతికతను తెలుసుకునే అవకాశం కల్పించడం అభినందనీయమన్నారు. రైతుల అభివృద్ధికి ఇటువంటి కార్యక్రమాలు మరింతగా నిర్వహించాలని ఆకాంక్షించారు.

**వ్యవసాయ అనుబంధ రంగాలకు ప్రోత్సాహం**

పశుపోషణ, ఉద్యాన పంటలు, ఆయిల్‌పామ్, ఆహార శుద్ధి పరిశ్రమలు, రైతు యంత్ర పరికరాల అద్దె కేంద్రాలు, సూక్ష్మ సేద్యం వంటి వ్యవసాయ అనుబంధ రంగాల్లో ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను అధికారులు వివరించారు. రైతులు వ్యవసాయంతో పాటు అనుబంధ రంగాలను కూడా చేపట్టి అదనపు ఆదాయం పొందే అవకాశాలను పరిశీలించాలని సూచించారు.

వ్యవసాయ అవసరాల కోసం వినియోగించే ట్రాక్టర్లు, ఇతర వాహనాలకు సంబంధించిన నిబంధనలు, రాత్రి వేళల్లో రహదారులపై ప్రయాణించే వ్యవసాయ వాహనాలకు ప్రతిబింబించే పట్టీ ఏర్పాటు వంటి రహదారి భద్రత అంశాలపై కూడా రవాణా శాఖ అధికారులు అవగాహన కల్పించారు.

రైతులతో ముఖాముఖికార్యక్రమం అనంతరం నిర్వహించిన రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తలు, ప్రగతిశీల రైతులు పాల్గొన్నారు. వివిధ పంటలు, నీటి యాజమాన్యం, పంట ఆరోగ్యం, వ్యవసాయ యాంత్రీకరణ, ప్రభుత్వ పథకాలు, వ్యవసాయ అనుబంధ రంగాలకు సంబంధించిన అంశాలపై రైతులతో చర్చించారు.

జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సత్యవాణి మాట్లాడుతూ, నూతన సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయ యాంత్రీకరణ పరికరాలు, ఆధునిక ఎరువులు, పురుగుమందులు, వివిధ వ్యవసాయ ఉత్పత్తులను ఒకే వేదికపై రైతులకు పరిచయం చేయాలనే ఉద్దేశంతో అగ్రి ఎక్స్‌పో నిర్వహించినట్లు తెలిపారు. సమగ్ర పంటల నిర్వహణ పద్ధతుల కింద రైతులకు అందిస్తున్న శిక్షణ, సాంకేతిక సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి సత్యవాణి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సుబ్బారెడ్డి, పశుసంవర్ధక శాఖ జెడి రమేష్ నాయక్, డీసీవో గుర్రప్ప, వ్యవసాయ శాఖ ఏడీ అనిత, ఏపీఎంఐపీ పీడీ పద్మలత, వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్తలు శ్రీలక్ష్మి, వినీత, శివజ్యోతి, శ్రీనివాసులురెడ్డి, డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్ఆత్మ ఉషారాణి, డీలర్లు, రైతులు, శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# సొమ్మొకరిది సోకు ఒకరిది






**ఒంటిమిట్ట, జనసముద్రం న్యూస్, ఆగస్టు 19:**
మేడా రఘునాథరెడ్డి ఎంపీ ఫండ్స్ లో కొండమాచపల్లి స్మశానం 7 ఏ లక్ష రూపాయలు మంజూరు చేసి ఉన్నారు 7 లక్షల రూపాయలతో ఒక చిన్న రూమ్ కట్టారు నిర్మాణానికి సహకరించిన వారు మేడా రఘునాథరెడ్డి అయితే మేరు శివ నారాయణ పేరు ఏసుకొని బుధవారం ఏ అధికారి లేకుండా కనీసం కార్యదర్శి చెప్పకుండా ఒక వైసీపీ నాయకుడితో రిబ్బన్ కటింగ్ చేపించి బుధవారం ఓపెన్ చేసి ఏప్పుడో సర్పంచ్ పదవి పోయిన ఇప్పుడు సర్పంచ్ అని బోర్డు మీద వేసుకొని ఉన్నారు వేసుకోవచ్చునా సర్పంచ్ సొంత నిధులతో కట్టించినట్లు పేర్లు వేసుకొని ఉన్నారు సొమ్ము ఒకరిది సోకు ఒకరిది అన్న సామెతగా ఉంది వెంటనే ఆ బోర్డు తొలగించాలి

## శరభన్నపాలెం ఆశ్రమ పాఠశాల విద్యార్థులను సొంతపనులకు ఉపయోగించుకుంటున్నారని పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు.



**జిల్లా ఇంచార్జి జన సముద్రం న్యూస్.తేది ఆగస్టు 19**
అల్లూరి జిల్లా కొయ్యూరు మండలంలోని శరభన్నపాలెం బాలుర ఆశ్రమ పాఠశాల విద్యార్థులను రాజకీయ నాయకుల విగ్రహాల వద్ద, అలాగే సొంత పనులకు ఉపయోగిస్తున్నారని బాలల హక్కుల పరిరక్షణ ఫోరం అల్లూరి సీతారామరాజు జిల్లా కో కన్వీనర్ పాటి చంద్రశేఖర్ ఫిర్యాదు చేశారు. ఈరోజు శరభన్నపాలెంలో కొయ్యూరు మండల ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆయన ఈ ఫిర్యాదును అందజేశారు. విద్యార్థుల చేత ఇలా పనులు చేయించడం నిబంధనలకు విరుద్ధమని, బాలల హక్కుల చట్టాలకు, విద్యా హక్కు చట్టానికి, ప్రభుత్వ మార్గదర్శకాలకు పూర్తిగా విరుద్ధమని ఆయన పేర్కొన్నారు. ఆశ్రమ పాఠశాల విద్యార్థుల సంక్షేమం, రక్షణ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై తక్షణమే విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని ఆయన తన ఫిర్యాదులో కోరారు.

## పాస్టర్ వల్లూరి రమేష్ బాబుకు అరుదైన గౌరవం వేదాంత విద్యలో డాక్టరేట్

**మొగల్తూరు ఆగస్టు 19 జనసముద్రం ప్రతినిధి**
పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం మండలం సీతారాంపురం కు చెందిన పాస్టర్ వల్లూరు రమేష్ బాబుకు అరుదైన గౌరవం లభించింది.క్రైస్తవ సమాజానికి ఆయన అందిస్తున్న సేవలను గుర్తించిన మరనాత ఇంటర్నేషనల్ థియాలజీ యూనివర్సిటీ ఆయనకు డాక్టరేట్ ప్రకటించింది. ఈనెల 20న థాయిలాండ్ లో జరగబోయే కార్యక్రమంలో డాక్టరేట్ ప్రధానం చేయనుంది. వేదాంత విద్యలో డాక్టర్ ఆఫ్ డివినిటీ (డి.డి.) కేటగిరిలో ఆయనకు ఈ డాక్టరేట్ వరించింది. ఆయన డాక్టరేట్ అందుకో బోతున్నారనే వార్తతో పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం పరిసర ప్రాంతాల క్రైస్తవ సంఘాల పాస్టర్లు, విశ్వాసులు హర్షం వ్యక్తం చేస్తూ



ఆయనకు అభినందనలు తెలిపారు.

## ఘనంగా ఫోటోగ్రాఫర్స్ డే నిరుపేదలకు నిత్యవసర వస్తువులు పంపిణీ.



**మొగల్తూరు ఆగస్టు19 జనసముద్రం ప్రతినిధి ధనుంజయ్**
మొగల్తూరు ఏరియా ఫోటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఫోటో గ్రాఫర్స్ డే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మొగల్తూరు జాతీయ రహదారికెమెరా కనుగొన్న లూయిస్ డాగురే చిత్ర పటానికి కెమెరాకు పూల మాలలు వేసి నివాళు లర్పించారు. 187వ ఫోటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకొని గ్రామంలోని పేదలకు బియ్యం, నిత్యావసర వస్తువులు అందించారు. ఈసందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు లక్కు శేషు మాట్లాడుతూ డాగూరె కెమెరాను కనుగొనడంతో ఎన్నో లక్షల మంది జీవనభృతి పొందుతున్నామన్నారు. యువ ఫోటో గ్రాఫర్స్ కు ఆదునిక సాంకేతిక పరిజ్ఞానం సాధించేందుకు స్కిల్ సెంటర్ల ద్వారా శిక్షణ ఇవ్వాలని మొగల్తూరు ఏరియా అసోసియేషన్కు స్థలం కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు దొంగ సుబ్రహ్మణ్యం, గొల్ల డేవిడ్ ప్రభాకర్, తోట చిట్టి బాబు, కుక్కల సత్యనారాయణ, కార్యదర్శి సత్తినేని ఆనంద్, బొక్కా మురళీ, మల్లుల సత్యనారాయణ తిరుమాని ధర్మ తదితరులు పాల్గొన్నారు.

## భీమవరంలో రోడ్ల అభివృద్ధి పనులను పూర్తి చేయండి.

**- వీరవాసరం మడుగు పోలవరం, కాళీపట్నం రోడ్ల పనులకు నిధులు మంజూరు చేయాలి**
**- అసెంబ్లీ సమావేశాల్లో మాట్లాడిన భీమవరం ఎమ్మెల్యే అంజిబాబు**

**భీమవరం ఆగష్టు 19 జనసముద్రం ప్రతినిధి ధనుంజయ్**
భీమవరం - కాళీ పట్నం రహదారి పనులకు నిధులు మంజూరు చేయాలని, భీమవరం నియోజకవర్గంలో అతి ప్రధానమైన రహదారులను పూర్తి చేయాలని రాష్ట్ర పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. బుధవారం జరిగిన అసెంబ్లీ సమావేశంలో భీమవరం ఎమ్మెల్యే అంజిబాబు రోడ్ల అభివృద్ధిపై మాట్లాడారు. వీరవాసరం మడుగు పోలవరం, కాళీపట్నం రోడ్ల పనులకు నిధులు మంజూరు చేయాలని అర్ అండ్ బి శాఖమంత్రిని కోరారు. వీరవాసరం - నౌడూరు - మడుగు



పోలవరం గ్రామంలో 16 ఏళ్ల క్రితం రోడ్లు వేశారని, ఇప్పటి వరకు రోడ్లు వేయలేదని, ఆ గ్రామంలోని రోడ్ల పనులకు నిధులు మంజూరు చేయాలని కోరారు.

## ముఖ్యమంత్రి మంత్రి ఫోటోలకు పాలాభిషేకశీ రాయచోటి అభివృద్ధి ప్రదాత మంత్రి మండిపల్లి

**రామాపురం జనసముద్రం న్యూస్ ఆగస్టు 19**
రామాపురం మండలం నీలకంఠ రావు పేట రాయలసీమ నీటి భద్రతకు
రాయచోటి నియోజకవర్గం పరిధిలో 490-535 కిలోమీటర్ల వరకు సుమారు 350 కోట్లతో పనులు సీఎం చంద్రబాబు చొరవ మంత్రి రాంప్రసాద్ రెడ్డి కృషికి టిడిపి నేతలు అభినందలు 25 వేల ఎకరాల పరిధిలోని చెరువులకు హంద్రీనీవా నీళ్లు అందించడం కోసం కృషిచేసిన మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఫోటోలకు పాలాభిషేకం చేశారు ఈ కార్యక్రమంరామాపురం టిడిపి అధ్యక్షుడు గాలివీటి సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు
రాయచోటి రాయలసీమ సాగునీరు తాగునీటి



భద్రతను మరింత బలోపేతం చేసే దిశగా కూటమి ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయం పట్ల రాయచోటి నియోజవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు రాయచోటి అభివృద్ధి ప్రదాత మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అని టిడిపి నాయకులు కొనియాడుతున్నారు హంద్రీనీవా సుజల స్రవంతి ఫేస్ టు లో భాగంగా మెయిన్ కెనాల్ లో మిగిలిన పనులు అవసరమైన ప్రాంతాల్లో సీసీ లైనింగ్ నివా బ్రాంచ్ కెనాల్ తదితర పనులకు పూర్తి చేసేందుకు 1323.75 కోట్ల పరిపాలన అనుమతులను మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలియజేస్తున్నారు
ఈ కార్యక్రమంలో గాలివీటి సురేందర్ రెడ్డి, నీలకంఠపేట టిడిపి నాయకులు పెంచల్ రెడ్డి మహబూబ్బాషా, నియాజ్ సయ్యద్ పీర్ అబూబకర్,సిద్దిక్ ముజాహిద్,రమణ,సిరాజ్ మల్లికార్జున ఫారూఖ్ , ప్రజలుతదితరులు పాల్గొన్నారు

## పంచాయతీ పుంతపై మట్టి తవ్వుకుపోయిన వారిపై చర్యలు తీసుకోవాలి నరసాపురం జనసేన పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు ఇంజేటి దానం.

**మొగల్తూరు ఆగస్టు 19 జనసముద్రం ప్రతినిధి**
మొగల్తూరు పంచాయతీ పరిధిలో ఇంజేటి వారి పాలెం సమీపాన పంచాయతీ పుంత రోడ్ లో గల మట్టిని మట్టి మాఫియా దారులు భారీ యంత్రాలతో నాలుగు ట్రాక్టర్లు ఉపయోగించి మట్టిని అమ్ముకుని సొమ్ము చేశారని మట్టి మాఫియా దారులపై అధికారిక కఠిన చర్యలు తీసుకోవాలని జనసేన పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు ఇంజేటి దానం కోరారు. ఈ మేరకు మంగళవారం మొగల్తూరు తహసిల్దార్‌కు కార్యాలయానికి వెళ్లి కంప్లైంట్ చేశారు. పంచాయతీ పరిధిలోని పుంతను అక్రమంగా అధికారులు కళ్ళు కప్పి తవ్వేయడం



వల్ల ప్రజలకు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆయన తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా మట్టి తరలిస్తున్న వారిపై విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తవ్వకాలకు ఉపయోగించిన జెసిబి నాలుగు ట్రాక్టర్లను సీజ్ చేసి కోర్టులో హాజరు పరచాలని ఇంజేటి దానం మొగల్తూరు తహసిల్దార్ ఫరూక్ ను కోరినట్లు ఇంజేటి దానం విలేకర్లకు తెలిపారు. ప్రభుత్వ ఆస్తులను మట్టి మాఫియా నుంచి పరిరక్షించేందుకు అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని ఈ నిఘా నిరంతరం కొనసాగించాలని ఇంజేటి దానం విజ్ఞప్తి చేశారు. మట్టి మాఫియాకు మద్దతు తెలుపుతున్న విలేజ్ అధికారిపై పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.

## బిసి లకు 34% రిజర్వేషన్ కల్పించడంపై హర్షం బిసి వేదిక నాయకులు.

**లక్కిరెడ్డిపల్లి జనసముద్రం న్యూస్ ఆగస్టు 19**
అన్నమయ్య జిల్లా లక్కీరెడ్డిపల్లి లో కూటమి ప్రభుత్వం బీసీలకు 34% రిజర్వేషన్ కల్పించి అసెంబ్లీలో తీర్మానం చేయడం పట్ల స్థానిక బీసీ వేదిక ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు కి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి రవాణా శాఖ మంత్రి శ్రీ మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కి బిసి నాయకులు కృతజ్ఞతలు తెలియజేసి హర్షం వ్యక్తం చేశారు
ఈసందర్భంగా వారు మాట్లాడుతూ
పూలే అంబేద్కర్ అడుగుజాడల్లోఆనాడే స్వర్గీయ నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ తరుపున బీసీలకు స్థానిక సంస్థల్లో 20 శాతం రిజర్వేషన్లు కల్పించి ఆదర్శప్రాయుడు అయ్యాడు , అని అదే స్పూర్తితో మన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బీసీల రాజకీయ అభ్యున్నతి కోసం34%శాతం కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో



ఏర్పాటు చేయడం చాలా అభినందనీయమైన అంశం మని అలాగే దేశంలోని అన్ని రాజకీయ పార్టీలుకూడా బిసిలకు అసెంబ్లీ పార్లమెంట్ స్థానాలలో రిజర్వేషన్లు కల్పించడానికి కృషి చేయాలి అన్నారు.
ఈకార్యక్రమంలో మండల బిసి నాయకులు యలంకూరి విజయభాస్కర్, కృష్ణ బీజేపీ సీనియర్



నాయకులు, రమణ (గురుస్వామి ) మద్దుల రామచంద్రయ్య,కులాయప్ప,పి. ఆంజనేయులు,చంద్రశేఖర్, జయచంద్ర నాయుడు (బీజేపీ ) బుజ్జి బాబు, బసయ్య,కే.రెడ్డెన్న,విశ్వనాథం, పీరయ్య, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.

## చింతలపూడి గ్రంథాలయం వద్ద దుర్వాసనతో పాఠకుల అవస్థలు..! డ్రైనేజీ మురుగు వెంటనే తొలగించాలని డిమాండ్.

**జనసముద్రం న్యూస్ చింతలపూడి ప్రతినిధి ఆగస్టు19**
ఏలూరు జిల్లా చింతలపూడిలోని గ్రంథాలయం పరిసరాల్లో పారిశుధ్యం పూర్తిగా అధ్వానంగా మారింది. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం పక్క రోడ్డులో ఉన్న గ్రంథాలయం సమీపంలో డ్రైనేజీ మురుగు పేరుకుపోయి, రోజుల తరబడి శుభ్రం చేయకపోవడంతో తీవ్ర దుర్వాసన వెదజల్లుతోంది. గ్రంథాలయానికి ప్రతిరోజూ పాఠకులు, విద్యార్థులు వచ్చి చదువుకుంటుంటారు. అయితే గ్రంథాలయం పరిసరాల్లో నెలకొన్న దుర్వాసనతో పాఠకులు తీవ్ర



ఇబ్బందులు పడుతున్నారు. పుస్తకాలు చదవాల్సిన ప్రదేశంలో మురుగు వాసన భరించలేని పరిస్థితి నెలకొంది.
ప్రజల ఆరోగ్యానికి, పాఠకుల సౌకర్యానికి సంబంధించిన ఈ సమస్యపై అధికారులు నిర్లక్ష్యం వహించడం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్థానిక మున్సిపల్ అధికారులు స్పందించి, డ్రైనేజీ మురుగును వెంటనే తొలగించి, పరిసరాలను పూర్తిస్థాయిలో శుభ్రం చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## శాసనమండలి డిప్యూటీ చైర్మన్ గాతుమాటి మాధవరావు ఏకగ్రీవంగా ఎంపిక కావడం,ఎంతో సంతోషకరం,ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి.

**నెల్లూరు, ఆగస్టు 19, జన సముద్రం జిల్లా ప్రతినిధి.**
నేడు శాసనమండలిలో డిప్యూటీ చైర్మన్ తుమాటి మాధవరావు ఏకగ్రీవంగా ఎంపిక కావడం పై,ఎమ్మెల్సీ పర్వత రెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ధన్యవాదాలు తెలియజేస్తూ మాట్లాడారు.
వైయస్ జగన్మోహన్ రెడ్డి ఎప్పుడు ఒక కమిట్మెంట్ తో పని చేసే నాయకులకు అవకాశం
కమిట్మెంట్ ఉన్న నాయకుల ద్వారా, ప్రజా సమస్యలు పరిష్కారం కావాలని భావించే,గట్స్ ఉన్న లీడర్ వై యస్ జగన్ మోహన్ రెడ్డి ని కొనియాడారు. ఈరోజు వైయస్ జగన్మోహన్ రెడ్డి సారధ్యంలో, తూమాటి మాధవరావు ని డిప్యూటీ చైర్మన్ గా చేసుకోవడంలో,అందరం సమిష్టిగా పనిచేశామని తూమాటి మాధవరావు కి శుభాకాంక్షలు తెలియజేశారు .
కూటమి నేతలకు శాసనమండలి అంటే చిన్న చూపు.
కూటమి ప్రభుత్వానికి శాసనమండలి అంటే మొదటి నుంచి చిన్న చూపు ఉందని, దీనిపై కూటమి నేతలు వివక్షత చూపిస్తున్నారని అన్నారు. మొదటి రోజేడీఎస్సీ అంశం శాసనసభలో మాట్లాడిన అధికార పార్టీ నేతలు,పక్కనే ప్రతిపక్ష



పార్టీ బలంగా ఉన్న శాసనమండలిలో,దీనిపై చర్చించకపోవడంబాధాకరమన్నారు. శాసనమండలి లో డీఎస్సీ అంశంపై చర్చించాలని వైఎస్ఆర్సిపి డిమాండ్
ఈరోజుటికీ ప్రభుత్వం డీఎస్సీ పైచర్చకు రాకపోవడం.. చూస్తుంటే వారు డీఎస్సీలో చేసిన అక్రమాలు అన్యాయాలు ఎక్కడ బయటపడతాయోనన్న.. భయంతోనే దీనిపై చర్చకు వెనకాడుతున్నారని అన్నారు.
శాసనమండలిలో ప్రతిపక్ష పార్టీ గొంతు నొక్కాలనే,అధికార పార్టీ చూస్తుందన్నారు.
మండలిలో చైర్మన్ను అవమానించడం సరికాదు.
కూటమి ప్రభుత్వం శాసనమండలిలో సభ్యులను చైర్మన్ ని కూడా పదేపదే అవమానిస్తూ,అనేక రకాలుగా ఇబ్బందులు గురి చేస్తుందని ఆరోపించారు.
ఈరోజు శాసనమండలిలో డిప్యూటీ చైర్మన్ గా తుమాటి మాధవరావు బాధ్యతలు చేపట్టే సమయంలో,సభలో అధికార పార్టీ సభ్యులు సభలో ఉండకుండా జారుకోవడం చూస్తుంటే,శాసనసభ అంటే వారికి ఎంతవరకు గౌరవం ఉందో అర్థం అవుతుందన్నారు చట్టసభలు అంటే గౌరవం లేని కూటమినేతలకు భవిష్యత్తులో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.
తూమాటి మాధవరావు ఆధ్వర్యంలో శాసనమండలిలో, రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలు పరిష్కార దిశగా చర్చించి, అధికార పార్టీ.
అక్రమాలను ప్రజలకు తెలియజేస్తామన్నారు.

## పంటల బీమా, ఫార్మర్ ఐడీ నమోదుకు గడువు పెంపు.



**తూర్పుగోదావరి/ సీతానగరం/ ఆగస్టు 19/ జనసముద్రం న్యూస్ :** మండలంలో అర్హులైన రైతులందరూ 'ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన' (PMFBY) కింద పంటల బీమాతో పాటు 'ఆంధ్రప్రదేశ్ రైతు రిజిస్ట్రేషన్' పూర్తి చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి గౌరీదేవి సూచించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఖరీఫ్ పంటల బీమా నమోదు గడువును ఆగస్టు 15 నుండి ఆగస్టు 31 వరకు పొడిగించడం జరిగిందని, వరి పంటకు ఎకరానికి రూ 570, మినుముకు ఎకరానికి రూ 300 చెల్లించాల్సి ఉంటుందని, మీ సేవా, రైతు సేవా కేంద్రాలు లేదా క్రాప్ ఇన్సూరెన్స్ యాప్ ద్వారా నమోదు చేసుకోవచ్చునని, అగ్రిస్టాక్ ద్వారా ప్రస్తుతం భూయాజమానులు నమోదు చేసుకుంటే 11 అంకెల విశిష్ట ఫార్మర్ ఐడీ కేటాయించడం జరుగుతుందని, భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలు, సబ్సిడీలకు ఈ ఐడీ ప్రామాణికంగా మారుతుందని తెలిపారు. కావున అర్హత ఉన్న రైతులు మరియు భూయాజమానులు ఆగస్టు 31లోపు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి గౌరీ దేవి తెలిపారు.

## జక్కంపూడిని కలిసిన కోరుకొండ మండల ఎస్సీ సెల్‌నాయకులు



**తూర్పుగోదావరి/ సీతానగరం/ ఆగస్టు 19/ జనసముద్రం న్యూస్ :**
స్థానిక కోరుకొండ మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం నూతన కార్యవర్గ నాయకులు బుధవారం పార్టీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్సీ విభాగం నూతన మండల అధ్యక్షుడు కన్నేం శ్రీనివాస్ జక్కంపూడి రాజాకు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం శ్రీనివాస్‌ను రాజా శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాజానగరం నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు గొంతు లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శులు పైడిమళ్ల కిషోర్, గొల్ల అంబేద్కర్, గ్రామ కమిటీ అధ్యక్షులు కందికట్ల యేసు, ఖండవల్లి పెద్దిరాజు, బి.వెంకన్న బాబు, చిన్న రాజారత్నంతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## లక్కిరెడ్డిపల్లి ఎంపీడీవో రెడ్డెయ్య నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న లక్ష్మీ ప్రసాద్ రెడ్డి .





**లక్కిరెడ్డిపల్లి జనసముద్రం న్యూస్ ఆగస్టు 19**
లక్కిరెడ్డిపల్లె లో విధులు నిర్వహిస్తున్న ఎంపీడీవో రెడ్డెయ్య ఆహ్వానం మేరకు రాయచోటి టౌన్ లో నూతనంగా నిర్మించిన గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి సోదరుడు లక్ష్మీ ప్రసాద్ రెడ్డి హృదయపూర్వక హార్దిక శుభాకాంక్షలు తెలియజేసినారు . ఈ కార్యక్రమంలో లక్ష్మీ ప్రసాద్ రెడ్డి తో పాటు లక్కిరెడ్డిపల్లి మండల అధ్యక్షుడు యనమల మదన్మోహన్ రామాపురం మండల అధ్యక్షుడు సురేంద్ర రెడ్డి పాల్గొన్నారు

## విద్యార్థులు రోడ్డు దాటుటకు దారి కల్పించండి .

**లక్కిరెడ్డిపల్లి జనసముద్రం న్యూస్ ఆగస్టు 19**
లక్కిరెడ్డిపల్లి హైవే రోడ్డు విస్తరణ కార్యక్రమంలో భాగంగా పాతబస్టాండ్ ప్రాంతం లో హైవే రోడ్డులో ఏర్పాటు చేస్తున్న ఐరన్ గ్రిల్ ను పాఠశాల విద్యార్థులు రోడ్డు దాటుటకు సౌకర్యంగా ఉండేవిదంగా చేయాలనీ.మండల రెవిన్యూ అధికారి కి జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, చైర్మెన్ విజయ్ మోహన్, రిజ్వాన్ వినతిపత్రం అందజేశారు.



## శాసనసభలో కోవూరు ప్రజా సమస్యలను లేవనెత్తిన ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి .

**- 2 ఏళ్ల నమ్మకంఅభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమంలో ప్రజల నుంచి వచ్చిన సమస్యలు ప్రభుత్వం దృష్టికి**
**-హౌస్‌హోల్డ్ స్ప్లిట్టింగ్ జరగక పేద కుటుంబాలు ప్రభుత్వ లబ్ధికి దూరమవుతున్నాయి**
**- కొడవలూరు మండలంలో రీసర్వే కారణంగా దాదాపు 400 ఎకరాలు ప్రభుత్వ భూమిగా నమోదైన అంశంపై పరిష్కారం కోరిన ఎమ్మెల్యే**
**- పట్టాదారు పాసుపుస్తకాలు ఉన్నప్పటికీ భూముల రికార్డుల్లో మార్పులపై సమగ్ర పరిశీలనకు విజ్ఞప్తి**



**నెల్లూరు, ఆగస్టు 19, జనసముద్రం జిల్లా ప్రతినిధి.**
నియోజకవర్గంలోని ప్రజలు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను కోవూరు శాసనసభ్యులు శ్రీమతి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి శాసనసభ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. వర్షాకాల అసెంబ్లీ సమావేశాల మూడో రోజు బుధవారం సభలో ప్రశాంతి రెడ్డి మాట్లాడారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న హౌస్ హోల్డ్ స్ప్లిట్టింగ్ (కుటుంబాల విభజన), కొడవలూరు మండలంలోని భూ సమస్యలను సభ దృష్టికి తెచ్చి తక్షణ పరిష్కారం చూపాలని కోరారు.

ఇంటింటి ప్రచారంలో ప్రజా సమస్యల గుర్తింపు

'2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో పలు ప్రధాన సమస్యలు తమ దృష్టికి వచ్చాయని ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటివరకు ఒక్కసారి కూడా హౌస్ హోల్డ్ స్ప్లిట్టింగ్ ప్రక్రియ జరగలేదని వివరించారు. ఒకే పెద్ద కుటుంబంలో ఉంటూ వివాహమైన పిల్లలు లేదా వేరుగా నివసిస్తున్న దంపతులను ప్రత్యేక కుటుంబంగా గుర్తించకపోవడం వల్ల చాలామంది పేదలు ప్రభుత్వం అందించే సంక్షేమ ఫలాలను అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ అంశంపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించి హౌస్ హోల్డ్ స్ప్లిట్టింగ్‌కు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

కొడవలూరు మండలంలో రీసర్వే లొసుగుల పరిష్కారానికి విజ్ఞప్తి

కొడవలూరు మండల పరిధిలోని రైతు భూముల సమస్యను ఎమ్మెల్యే సభలో ప్రముఖంగా ప్రస్తావించారు. సుమారు 90 సంవత్సరాల క్రితం అక్కడ రైతులకు భూములు కేటాయించారని, వాటికి సంబంధించి పట్టాదారు పాసు పుస్తకాలు కూడా ఉన్నాయని గుర్తుచేశారు. అయితే, గత ఎన్నికల ముందు జరిగిన భూముల రీసర్వేలో తీవ్ర లొసుగులు చోటుచేసుకున్నాయని చెప్పారు. నాలుగు గ్రామాలకు చెందిన దాదాపు 400 ఎకరాల రైతుల భూములను రికార్డుల్లో 'ప్రభుత్వ భూమి'గా తప్పుగా నమోదు చేశారని తెలిపారు. ఇలాంటి భూ సమస్యలు ఒక్క కొడవలూరులోనే కాకుండా నియోజకవర్గవ్యాప్తంగా పలు ప్రాంతాల్లో నమోదయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. తరతరాలుగా సాగు చేసుకుంటున్న రైతులకు రీసర్వే నిర్ణయాల వల్ల తీవ్ర అన్యాయం జరిగిందని, ప్రభుత్వం ప్రత్యేకంగా పరిశీలించి ఆయా భూములను తిరిగి రైతుల పేరిట నమోదు చేసి న్యాయం చేయాలని శాసనసభ ద్వారా ప్రభుత్వాన్ని కోరారు.

## ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలి : ఏఐవైఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు మహంకాళి సుబ్బారావు .





**జనసముద్రంన్యూస్, నర్సరావుపేట, ఆగస్టు 19:**
కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖలలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమంలో భాగంగా పల్నాడు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిరుద్యోగ అభ్యర్థులతో నిరసన వ్యక్తం చేసినట్టు ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు మహంకాళి సుబ్బారావు తెలిపారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న తీవ్రమైన ఉపాధి సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందారని, ప్రస్తుతం రాష్ట్రంలో సరైన ఉద్యోగ అవకాశాలు లేక వేలాది మంది ప్రాధాన్యత కలిగిన నిరుద్యోగ యువత తీవ్ర ఆందోళనలకు గురవుతున్నారని ఉపాధి కోసం మన రాష్ట్ర యువత ఇతర రాష్ట్రాలకు మరియు విదేశాలకు వలసకు వెళుతున్నారని, మరో పక్క ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్ వస్తాయని ఆశతో వేలాదిమంది అభ్యర్థులు తమ దగ్గర ఆర్థికంగా వెసులుబాటు లేకపోయిన అప్పుచేసి హైదరాబాద్, విశాఖపట్నం, విజయవాడ, కాకినాడ, అవనిగడ్డ అంటి ప్రాంతాలలో కోచింగ్ తీసుకుంటున్నారని రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని గ్రూప్-1, గ్రూప్- 2, పోస్టులు పెంచి నోటిఫికేషన్ ఇవ్వాలని, పోలీస్ శాఖలో ఖాళీగా ఉన్న ఎస్సై, కానిస్టేబుల్ పోస్టులను పెంచి నియమకాలు చేపట్టాలని, వయోపరిమితి పెంచాలని, డీఎస్సీ ని ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా నిర్వహించాలి, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన బ్యాక్ లాగ్ పోస్టులను స్పెషల్ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేయాలని, ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్, మరియు దేవదాయ శాఖలో ఖాళీగా ఉన్న పోస్టు భర్తీ చేయాలని, హైకోర్టు, జిల్లా కోర్టులో ఖాళీగా ఉన్న క్లర్క్, స్టెనో, అసిస్టెంట్ వంటి అన్ని పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని మరియు ఏపీపీఎస్సీని ప్రక్షాళన చేసి నూతన చైర్మన్, సభ్యులను నియమించాలని 2018 నుండి 2024 వరకు ఏపీపీఎస్సీ నిర్వహించిన పరీక్షల నిర్వహణ పైన సిబిఐ చేత విచారణ చేయించాలని,2018 గ్రూప్ -1 మెయిన్స్ పరీక్ష ఫలితాలలో అవతవకలు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ ఏరియా కార్యదర్శి రోద్ద అంజిరెడ్డి, యు.రాజు, మక్కెనవంశి, గడ్డం సురేంద్ర బాబు, నవీన్, నిరుద్యోగ అభ్యర్థులు క్రాంతి, షహనాజ్, రేణుక, భాష, మహమ్మద్ జానీ, దినేష్, విజయ్ రాంబాబు, అనిల్,ప్రశాంత్, గోపి,నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## నాగార్జునసాగర్ కు 30 టీఎంసీలు నీటి చేరిక



**జన సముద్రం న్యూస్ పల్నాడు జిల్లా ప్రతినిధి ఆగస్టు 19**
గత ఏడాది జులై 28వ తేదీన నాగార్జునసాగర్ క్రెస్ట్ గేట్ల ద్వారా నీటిని దిగువకు విడుదల చేశారు. సకాలంలో వర్షాలు కురవటం ఎగువనున్న రాష్ట్రాల్లోని ఆల్మట్టి, నారాయణపూర్, వంటి కర్ణాటక రాష్ట్రంలోని ప్రాజెక్టులు నిండడం తద్వారా తెలంగాణ లోని జూరాల ప్రాజెక్ట పూర్తిస్థాయినీటి సామర్థ్యాన్నిసంతరించుకోవడంతో జులై 8వ తేదీన శ్రీశైలం గేట్లు ఎత్తి దిగువనున్న సాగర్ కు నీటి విడుదలని చేశారు. దీంతో 20 రోజుల్లోనే నాగార్జునసాగర్ పూర్తిగా నిండి నిండుకుండలా మారింది. దీంతో సాగర్ గేట్లను 28వ తేదీన ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. కాగా ఈ ఏడాది ఏలిని నో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు రెండు తెలుగు రాష్ట్రాలలో నెలకొంది. దీంతో జలాశయానికి వరద నీరు వచ్చి చేరలేదు. కాగా ఎగువ రాష్ట్రాలైన మహారాష్ట్ర కర్ణాటక గత నెలలో భారీ వర్షాలు కురవడంతో ఆయా రాష్ట్రాలలోని ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో నిండి నిండుకుండలా మారడంతో కర్ణాటక రాష్ట్రంలోని ఆల్మట్టి గేట్లు ఎత్తి దిగువనున్న నారాయణపూర్ కు నీటిని విడుదల చేశారు. నారాయణపూర్ ప్రాజెక్ట పూర్తిస్థాయి నీటి సామర్థ్యం సంతరించుకోవడంతో నారాయణపూర్ గేట్లు ఎత్తి దిగువనున్న జూరాల ప్రాజెక్టుకు నీటిని విడుదల చేశారు. కాగా జూరాల ప్రాజెక్టుకు భారీగా వరద నీరు రావడంతో జలాశయం పూర్తిగా నిండుకోవడంతో ప్రాజెక్టుకు నీటిని విడుదల చేశారు పైనుంచి వచ్చిన వరదలు పూర్తిగా దిగువనున్న శ్రీశైలానికి విడుదల చేశారు. దీంతో అతి కొద్ది కాలంలోనే శ్రీశైలం ప్రాజెక్ట 879 అడుగులకు చేరుకుంది. దీంతో మరో రెండు రోజుల్లో శ్రీశైలం ప్రాజెక్ట 885 అడుగులు ఉన్న శ్రీశైలం ప్రాజెక్ట పూర్తిగా నిండుకొని గేట్లు ఎత్తి నీటిని దిగువకు నీటిని దిగువకు విడుదల చేయనున్నారని. సమాచారంతో రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలు రైతాంగం ఆనందంతో మునిగిపోయారు. ఇంతలోనే ఎగువ రాష్ట్రాల నుంచి వచ్చే వరద ఆగిపోవడంతో ఏ ప్రాజెక్ట గేట్లు ఎక్కడకక్కడే ఆపివేయడంతో శ్రీశైలం పూర్తిస్థాయికి చేరుకోకుండానే ఆగిపోయింది. పైగా అధికారులు జల విద్యుత్ కేంద్రాలలో విద్యుత్ ఉత్పత్తి చేస్తూ ఉండడంతో శ్రీశైలం ప్రాజెక్టులో కూడా నీరు తగ్గుతూ వస్తుంది. శ్రీశైలం జలాశయం నుండి విద్యుత్ ఉత్పాదన ద్వారా విడుదల చేస్తున్న క్రమముగా నాగార్జునసాగర్ కు చేరుకుంటున్నాయి. గత నెల నీరు జులై చివరి నాటికి 137 టీఎంసీలు ఉండగా ఆగస్టు 19వ తేదీ బుధవారం 167 టిఎంసిలకు చేరింది. దీంతో ఇప్పటివరకు 30 టీఎంసీలు నీరు సాగర్ వచ్చి చేరింది. ఈనెల మొదటి నుండి నేటి వరకు రోజుకు సగటున 1.5 టిఎంసిల చొప్పున 137 టీఎంసీల నుండి 167 టీఎంసీలకు చేరువైంది.

ప్రస్తుతం సాగర్ నీటి సమాచారం . శ్రీశైలం జలాశ నీటిమట్టం 875. 50 అడుగుల ఉంది. ఇది 165.9244 టీఎంసీలకు సమానం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు ఇది 215.7070 టీఎంసీలకు సమానం కాగా జూరాల నుంచి శ్రీశైలానికి 66,495 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది నాగార్జునసాగర్ నీటిమట్టం బుధవారం సాయంత్రానికి 529.80 అడుగులు ఉంది. ఇది 167.75 68 టీఎంసీలకు సమానం. నాగార్జునసాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు 312.04 50 టీఎంసీలకు సమానం. కాగా శ్రీశైలం నుండి నాగార్జునసాగర్ కు 28,328 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతుంది.

## సర వేగంగా జరుగుతున్న ఎస్సీ ఎస్టీ బీసీ ఓటర్ల గుర్తింపు సర్వే .



**మొగల్తూరు ఆగస్టు 19 జనసముద్రం ప్రతినిధి**
ధనుంజయ్:పశ్చిమగోదావరి జిల్లా మొగల్తూరు గ్రామంలో ఎస్సీ, ఎస్టీ బీసీ ఓటర్ల గుర్తింపు సర్వే రాష్ట్ర ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు మొగల్తూరు గ్రామ ప్రత్యేక అధికారి సిహెచ్ త్రిశూలపాణి సూచనల మేరకు గ్రామములో జరుగుతుంది. ఈనెల 18వ తేదీ మంగళవారం నుండి ప్రారంభమైన ఓటర్ల గుర్తింపు సర్వే 22వ తేదీ వరకు మొగల్తూరు గ్రామంలో స్వర్ణ గ్రామ పంచాయతీ అభివృద్ధి అధికారి బొండాడ పరమానందరావు పర్యవేక్షణలో గ్రామపంచాయతీ మరియు సచివాలయం ఉద్యోగులు తో ఐదు బృందలుగా ఏర్పడి అధికారులు సర్వే వేగంగా పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నారు. ఈ సందర్భంగా జిపిఓ పరమానందరావు మాట్లాడుతూ మొగల్తూరు గ్రామంలో ఓటర్ల గుర్తింపు సర్వే జరుగుతుందని సర్వే సిబ్బంది ఇంటికి వచ్చిన సమయంలో ఓటరు గుర్తింపుకు పత్రం 15-4- 2026వ తేదీ కి ముందు గల కుల ధ్రువీకరణ పత్రం చూపించి తమ ఓటును నిర్ధారణ చేసుకోవాలని కోరారు. సర్వే పూర్తి అయిన వెంటనే 26 వ తేదీ నుండి మూడు రోజులు పాటు అభ్యంతరాల స్వీకరణ నిర్వహిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 7వ తేదీ 2026వ తేదీన మొగల్తూరు గ్రామంలో తుది ఓటర్ల జాబితా ప్రకటిస్తామని తెలిపారు. సర్వే సిబ్బందికి సకాలంలో సమర్పించలేని ఓటర్లు స్వయంగా గ్రామపంచాయతీ కార్యాలయమునకు గాని సిబ్బందికి గాని తగిన సమాచారం సమర్పించవలసి ఉంటుందని ఆయన కోరారు.

## వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వర్యులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ని మర్యాద పూర్వకంగా కలిసిన నెల్లూరు జిల్లా యువజన విభాగ అధ్యక్షుడు డాక్టర్ మేరిగ రేవంత్ చక్రవర్తి

**నెల్లూరు, ఆగస్టు 19, జన సముద్రం జిల్లా ప్రతినిధి**
వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వర్యులు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు, నెల్లూరు జిల్లా వైస్సార్ కాంగ్రెస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడిగా డాక్టర్ మేరీగ రేవంత్ చక్రవర్తి నియమితులయ్యారు

ఈ నియామకం సందర్భంగా బుధవారం తాడేపల్లిలోని వైస్సార్ కాంగ్రెస్ పార్టీ కేంద్ర కార్యాలయంలో శ్రీ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ని డాక్టర్ రేవంత్ చక్రవర్తి మర్యాదపూర్వకంగా కలిసి, కృతజ్ఞతలు తెలియజేశారు

తనపై ఉంచిన నమ్మకాన్ని ఎల్లవేళలా కాపాడుకుంటూ, పార్టీ అప్పగించిన బాధ్యతను అత్యంత సమర్థవంతంగా నిర్వర్తిస్తానని అధినేతకు స్పష్టం చేశారుపార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ, వైస్సార్ కాంగ్రెస్ పార్టీ లాక్ష్యలను మరియు పార్టీ సిద్ధాంతాలను జిల్లాలోని యువతలోకి బలంగా తీసుకెళ్తానని ప్రకటించారు

జిల్లాలో వైస్సార్ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి, రాబోయే రోజుల్లో పార్టీ విజయంలో యువజన విభాగాన్ని ముందంజలో ఉంచడానికి తన వంతు శాయశక్తులా కృషి చేస్తానని హామీ ఇచ్చారు

అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి మార్గదర్శకం :డాక్టర్ రేవంత్ చక్రవర్తికి అభినందనలు తెలిపిన వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీ అభివృద్ధికి మరియు యువత భాగస్వామ్యానికి సంబంధించి కీలక సలహాలు, సూచనలు అందించారు.

## 3డీ టెక్నాలజీతో ఇంటి వస్తువుల తయారీపై అవగాహన.



**జిల్లా ఇంచార్జి జన సముద్రం న్యూస్.తేది ఆగస్టు 19**
అల్లూరి జిల్లా కొయ్యూరు :ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినులకు 3డీ టెక్నాలజీ వినియోగంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 3డీ టెక్నాలజీ ద్వారా ఇంట్లో ఉపయోగించే వివిధ వస్తువులను డిజైన్ చేసి, తయారు చేసుకునే విధానాలను విద్యార్థినులకు వివరించారు.కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సుధ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డాక్టర్ డి.సి.హెచ్. రాజుబాబు కోఆర్డినేటర్‌గా వ్యవహరించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై. వెంకటలక్ష్మి, వాణిజ్యశాస్త్ర అధ్యాపకులు బోండ్ల శేఖర్ పాల్గొన్నారు.విశాఖ జిల్లా నవనిర్మాణ సమితి ఆధ్వర్యంలో సమితి ప్రతినిధులు కె. రవికుమార్, వి.వి.ఎస్.ఎస్.ఎస్. కుమార్ విద్యార్థినులకు 3డీ టెక్నాలజీపై అవగాహన కల్పించారు. రోజువారీ జీవితంలో ఉపయోగించే చిన్నచిన్న వస్తువులను 3డీ టెక్నాలజీతో సులభంగా తయారు చేసుకునే విధానాన్ని ప్రదర్శన ద్వారా వివరించారు.ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విద్యార్థినులు అవగాహన చేసుకుని, విద్యాభివృద్ధితో పాటు భవిష్యత్ ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలకు వినియోగించుకోవాలని నిర్వాహకులు సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.




Published by Rajeshwari Publications,D.No.4-3-99-1,Anantapur 515001 Rege: R.N.I.No APTEL/2021/16151 for Queries Contact us @ 94941 84136, janasamudram2021@gmail.com. Follow us on www.janasamudram.com,fb/janasamudram